సెప్టెంబర్ - 2022

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


**గౌరవ సంపాదకులు :**

**కె. సామ్యేల్ రాజేంద్ర**

**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**


**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. **350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-


**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లాపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726


**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**


A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole


IFSC Code : SBIN0000890

## విషయసూచిక


| | |
|---|---|
| సంపాదకీయం ఎడిటర్ | 02 |
| జప్పత్వనేహు కొడవటికంటి | 03 |
| 'నేను తోపుని'ఇమ్మానియేలు రాజేంద్ర | 06 |
| మిక్కిలి సాత్వికుడు కొడవటికంటి | 07 |
| దేవుడు - సిరి | 09 |
| రాహాబు | 10 |
| సాక్ష్యము వై. పద్మాదేవి, పూనూరు | 12 |
| కొండలను కదిలించు ప్రార్థన | 14 |
| మేరీజోన్స్ చిన్నపిల్లల పేజి | 16 |
| కృపాదానం కొడవటికంటి | 18 |
| ధైర్యముగా ఉండుము | 20 |
| లంచము | 21 |
| లోకంతీరు ఇమ్మానియేలు రాజేంద్ర | 22 |
| పరిశుద్ధగ్రంథ పరిశోధన పట్టిక-3 | 24 |

# సంపాదకీయం.....



**హన్నాకృప పాఠకులకు  కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర నమస్కారములు.**

**గత నెలలో మనము స్వాతంత్ర్య దినోత్సవము జరుపుకున్నాము. మనకు స్వాతంత్ర్యం వచ్చి 76వ సం॥లోకి అడుగుపెట్టాము. మన దేశానికైతే స్వాతంత్ర్యం వచ్చింది కానీ, దేశంలో నివశిస్తున్న మనకు లోకాధికారి అయిన సాతాను చెర నుండి విముక్తి లభించలేదు. అనేకమంది సాతాను చెరలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నారు. అనేకమంది సాతాను పన్నిన తాగుడు, జూదము, వ్యభిచారము, ధనాపేక్ష మొదలైన వలల్లో చిక్కుకొని తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ప్రసంగి 7:29లో "దేవుడు నరులను యథార్థవంతులనుగా పుట్టించెను గాని వారు వివిధమైన తంత్రములను కల్పించుకొనియున్నారు" వ్రాయబడినట్లు, మానవులందరూ దేవుడు వారికిచ్చిన స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగపరచుకొని, తమ కోసం వివిధ తంత్రాలు కల్పించుకొని సాతానుకు బంధీలుగా మారిపోతున్నారు. వారంతా వాటి నుండి బయటపడినప్పుడు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు. దేవుని వాక్యము తెలియని వారెందరో సాతానుకు బంధీలుగా చిక్కుతున్నారు. వారంతా సాతాను చెర నుండి విడుదల పొందాలంటే వారికి వాక్యము బోధింపబడాలి. "మీరు నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" యోహాను 8:31.32. కాబట్టి అలాంటి వారికి వాక్యము అందించబడేలా, వారు సత్యమును గ్రహించి, సాతాను చెర నుండి విడుదల పొంది, నిజమైన స్వాతంత్ర్యము పొందేలా ప్రార్థన చేద్దాము. అలాంటి వారికి సువార్త అందించబడాలని, వారు సాతాను బంధకాల నుండి విడుదల పొందాలని దేవుడు తన రాకడను ఆలస్యము చేయుచున్నాడని గ్రహించాలి.**

**ఆగష్టు 17న  నా  జన్మదినము.  82 సంవత్సరాలు నిండి 83వ సంవత్సరములోకి అడుగుపెట్టాను. దేవుడు నాకు అధిక బలము దయచేసినప్పటికీ నేను దేవునికి సన్నిధికి చేరవలసిందే. పత్రికను నడిపిస్తున్న నా రెండవ కుమారుడు ఇమ్మానియేలు రాజేంద్రకి మీ సహాయ సహకారాలు అందించి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసిందిగా ప్రభువు నామమున మిమ్మును కోరుచున్నాను. దేవుడు మిమ్మును దీవించును గాక!**

–కొడవటికంటి  సామ్యేల్ రాజేంద్ర, ఎడిటర్

**K. Emmanial Rajendra,  SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

సీరియల్

# జప్నత్పనేహు

**(యోసేపు జీవితచరిత్ర)**

**5**

**- కొడవటికంటి**

షిమ్యోను, లేవి, వెనుక పనివారు – విస్తారమైన దోపుడు సొమ్ము గాడిదలమీద, పశువులమీద షెకెము పట్టణంలోను, దాని పొలములలో ఉన్నదంతా దోచుకొని వచ్చారు. ఆ దృశ్యము ఇంకా తన కళ్ళముందు ఇప్పటికి కనిపిస్తున్నట్లు గానే ఉంది. ఎప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడు ఈ ప్రాంతం వదిలి వెళ్ళిపోతానా? అని బాధపడుతూనే ఉన్నాడు. ఇంకోసారి తన జీవితంలో షెకెము రాకూడదు అనుకున్నాడు. తన తండ్రి షెకెములో కొన్న స్థలము తన సమాధి కొరకేగాని, జరిగిన సంగతులు కళ్ళారా చూసిన వారెవ్వరూ ఇక్కడ సుఖంగా ఉండలేరు. షిమ్యోను, లేవి వారి కోపం వేంద్రమైనది. వారి ఉగ్రత కఠినమైనది. అది శపింపబడును. తన తండ్రి ఆ రాత్రి కన్నీరు కారుస్తూ 'యాకోబులో వారిని విడగొడతాను, నా సంతానంలో దేవుని విశ్వసించిన వారి నుండి వారిని చెదరగొడతాను' అని అన్నాడు.

నిజానికి షిమ్యోను, లేవి తమ చెల్లెలు చెరచబడినందుకు తమ తండ్రి యొక్క నిర్లక్ష్య భావనకు నిరసనగా వధ చేసినా, తమ పిన్నమ్మలైన బిల్హా, జిల్పా పిల్లలు వారు చాలా చెడునడతకు అలవాటు పడినవారు, బహు కౄరులు. ఎటువంటి హత్య చేయటానికైనా కూడా వెనుకాడరు. అన్నదమ్ములని కూడా చూడరు. వారు తన మీద పగబట్టి యున్నందువల్లనే తండ్రి తనని వారితో మందల వెంబడి పంపటం మానివేశాడు. దాను, నఫ్తాలి, గాదు, ఆషేరు తనకు ఏదైనా కీడు చేస్తారని తన తండ్రి భయపడినా, పెద్దవాడైన రూబేనును బట్టి ధైర్యము కలిగి ఉండేవాడు.

ఉదయం ప్రొద్దుపొడిచిన తర్వాత నిద్రలేచి ఐగుప్తును, అతని స్నేహితుని సిద్ధపరచి, అతిథి ఇచ్చిన రొట్టెలు తిని, ఒంటె పాలు త్రాగి దోతానుకు బయలుదేరాడు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. దూరంగా దోతాను కొండ కనబడుతుంది. సూర్యుని నీడ తన వీపు మీద నుండి క్రిందికి దిగుతుంది. యోసేపు దోతాను వైపుకు వెళ్తున్నాడు.

దోతానుకు వచ్చి మూడు రోజులైంది. ఇక్కడ కూడా పశువులకు నీరుకాని మేతకాని సరిగా అందటం లేదు. మందలన్నీ ఒకచోట చేరితే అన్నిటికీ సరిపోదు. అందువల్ల మందలను మూడు భాగాలుగా చేసి తమ్ములను ఒక్కొక్క మందకు ముగ్గురిని చొప్పున పంచి, తన ఒంటెమీద ఈ మూడు చోట్ల మందల క్షేమం విచారిస్తున్నాడు రూబేను. ఇంటివద్ద నుండి విస్తారంగానే వేయించిన గోధుమలు, కాల్చిన రొట్టెలు ఒక నెలకి సరిపోయినవి తీసుకొచ్చాడు. ఇంకా అవి ఎక్కువ రోజులు రావు. ఇంటివద్ద నుండి కనీసం పదిరోజులకు ముందే ఆహారం రావలసి ఉంది. కాని ఇంత వరకు రాలేదు. ఇంటి దగ్గర సంగతులు ఏవి తెలియటం లేదు. ఆషేరు, గాదు ఎక్కువగా సణుగుకుంటున్నారు. రొట్టెలు లేకుండా మాంసం తినాలంటే ఎవరికైనా విసుగే కదా!

అదే యోసేపు మందలతో ఉంటే తండ్రి మూడు, నాలుగు రోజులకొకసారైనా భోజన పదార్థాలను ఇంటి వద్ద నుండి పంపించేవాడు. తన ముసలితనంలో పుట్టినవాడైనందున, తల్లిలేనివాడైనందున యోసేపును తండ్రి గారాబంగా చూసుకొనేవాడు.

ఆ విచిత్రమైన రంగుల అంగీవాడిని రోజంతా చూసుకుంటూ మన ఆహారం విషయం కూడా మర్చిపోయినట్లున్నాడు. మీకు ఒళ్ళు బలిసింది, తిండి ఎక్కువైంది అని తండ్రి తమను తిట్టినరోజే ఈ స్థితికి వస్తామని అనుకున్నాము. ఈ మాత్రం ఆహారం సంపాదించుకోలేని అసమర్థులమయ్యామా? పోనీ యోసేపు ఒక్కడే తన కొడుకా?

రూబేను తన గాడిదకు గంత కడుతూ వెనక్కి తిరిగి చూశాడు. యూదా, నఫ్తాలి గట్టిగా మాట్లాడుకుంటున్నారు. సాధారణంగా నఫ్తాలి చక్కగా మాట్లాడుతాడు, కోపం అంత తొందరగా చూపించడు. దాను చిన్నదానికే కోపగించు

కుంటాడు. కాని నఫ్తాలి ముఖం ఈసారి కందగడ్డ వలె చేసుకొని మాట్లాడుతున్నాడు.

రూబేను ఈ రోజు ఆలస్యంగా నిద్రలేచినందువల్ల పడమటి వైపునున్న జెబూలూను, షిమ్యోను, లేవిని ప్రతిరోజు చూసే సమయం కంటే ఆలస్యం అయింది. ఈ సంవత్సరం నీటి కరువు ఎక్కువగానే ఉంది. షెకెము కంటె ఇక్కడ కొంచెం చల్లగా ఉన్నా మేత విస్తారంగా లేదు. రెండు మైళ్ళ దూరంలో మైదానంలో ఉన్న నదీపాయ దగ్గర నీళ్ళు ఇంకా పదిహేను రోజుల వరకు సరిపోవచ్చు.

అసలు యూదా, నఫ్తాలి ఏ విషయం మాట్లాడుకుంటు న్నారో అనుకుంటూ...గాడిదను తలకొయ్యకు కట్టి వారి దగ్గరకు వెళ్ళాడు. రూబేనును చూసి నఫ్తాలి కొంచెం నిదానించినట్లు కనబడ్డాడు. "ఈరోజు మధ్యాహ్నానికి రొట్టెలు లేవు. అసలు నిన్నటికే లేకపోతే తూర్పున ఉన్న గాదు, లేవి, ఆషేరు వాళ్ళ దగ్గర్నుండి పది రొట్టెలు తీసుకొని వచ్చాము. వాళ్ళ దగ్గర కూడా ఈ రోజుతో రొట్టెలు అయి పోయాయి. వేయించిన గోధుమలు మాత్రం కొద్దిగా ఉన్నాయి" అని అన్నాడు.

రూబేను ఆలోచిస్తున్నాడు. 'ఏమి చెయ్యాలి? మామూ లుగా అయితే పదిరోజులకు ఒకసారైనా ఇంటి దగ్గర్నుండి భోజన పదార్థాలు వచ్చేవి. తండ్రి ఎందుకు ఇంత ఆలస్యం చేశాడు?' నఫ్తాలి దగ్గరగా వచ్చి గొంతు సవరించుకొంటుంటే రూబేను అటు చూశాడు.

"యోసేపు మన దగ్గర ఉన్నంతకాలం ఇంటి దగ్గర్నుండి వెంటవెంటనే సరుకులు వస్తుండేవి. యోసేపు మన దగ్గర ఉంటే పాడైపోతాడని తండ్రి పంపలేదు. మేము ఆయన కొడుకులం కాదా? యాకోబులో మాకు పాళ్ళు లేవా? యోసేపు మా ఏలిక అయినట్లు కలగంటే, తండ్రి నిజంగానే మమ్ములను యోసేపుకు బానిసల్ని చేస్తాడా? ఆ కలలు కనే వాడివల్లనే ఇన్ని తిప్పలు వచ్చాయి. నాలుగు నెలల క్రితం షిలోహు దగ్గర ఉన్నప్పుడు మా మీద అంటే మేము దాసీల పుత్రులమని వాడు గర్వించి 'బిల్హా కుమారులు, జిల్పా కుమారుల చెడుతనము నేను భరించలేనని' మన తండ్రి అనేటంత గొప్పగా మామీద చాడీలు చెప్పాడు. అందు వల్లనే ఈనాడు రాత్రింబగళ్ళు ఈ ఎడారులలో మందలు ఆహారం తిని పందుకుంటే, వాటిని చూసి మేము ఏడవాల్సి వస్తుంది" అని అన్నాడు.

అట్లా అంటూనే తూర్పు నుండి వస్తున్న గాదు, ఆషేరును చూపిస్తూ "అదిగో వాళ్ళు వస్తున్నారుగా!" అని తన చెయ్యి చూపించాడు.

రూబేను, యూదా అటు తిరిగినప్పుడు గాడిదల మీద కాకుండా నడిచివస్తున్న గాదు, ఆషేరు కనిపించారు. వాళ్ళు చాలా కోపంగా వస్తున్నారు. యూదా – అన్న వైపు చూచి మాట్లాడవద్దని సైగ చేసి, వారి కొరకు లేచియున్నాడు.గాదు వస్తూనే ప్రక్కన చెట్టు క్రింద కూలబడి ఆయా సంతో రొప్పుతుంటే ఆషేరు రూబేనుని కలుసుకున్నాడు.

ఆషేరు కోపంగా– ఆ రంగుల అంగీవాడు ఒక్కడే తన కొడుకైతే, తన కుడిచేతి పుత్రుడే తనకు లోకమైతే మా పాళ్ళు మాకు పంచిపెట్టవచ్చు కదా!" అంటూ గాదు ప్రక్కన కూలబడ్డాడు.

యూదా కల్పించుకొని "అదికాదు ఆషేరూ! అక్కడి పరిస్థితులు మనకు తెలియదు కదా! అక్కడ ఏం ఆపద ముంచుకొచ్చిందో, ఇక్కడికి దూరంలో ఉన్న మన ఇంటి వ్యవహారాలు మనకు ఎలా తెలుస్తాయి? అనవసరంగా తండ్రి ప్రేమను అపార్థం చేసుకోవద్దు. దేవునికి భయపడి మాట్లాడు. నేను చూచినంత వరకు మన తండ్రిని మించిన యోగ్యుడు లేడు. ఆయన కూడా మనిషే కదా! ఏ తండ్రికైనా తల్లిలేని బిడ్డలమీద ప్రత్యేకమైన ప్రేమ ఉండదా? చిన్నమ్మ చనిపోయిన తర్వాత ఆయన ఎంత కృంగిపోయాడో మీకు తెలీదా? షెకెములో వ్యాపారం చేస్తున్నప్పటి మన తండ్రికి, ఎఫ్రతా మార్గంలో మన పినతల్లిని భూస్థాపితం చేసిన మన తండ్రికి ఎంత బేధం? ఆలోచించు. యోసేపు తప్పు ఏమిటి?చిన్నవాడు కాబట్టి తన కలలు ఇంకొకరిని నొప్పిస్తా యని తెలీక...."

వెంటనే గాదు కల్పించుకొని "తెలియక అని అనొద్దు, పదిహేడేళ్ళు నిండిన వానికి తెలియని సంగతులు ఉంటా యా? హెబ్రీయులలో అమాయకపు యువకులు కూడా ఉంటారా? మా మీద చాడీలు చెప్పేది అతని మంచితనాన్ని

తన తండ్రి దగ్గర పెంచుకోవాలని కాదా? ఈనాటి ఈ ఆకలి బాధ యోసేపు పన్నిన కుట్ర కాదా? యోసేపు అనేవాడు ఈ భూమి మీద లేకుంటే ఈనాటి మన స్థితి వేరొక రకంగా ఉండేది. మనకు మనసు నెమ్మది గా ఉండేది. మన తండ్రికి ఈలాటి వ్యధ ఉండేది కాదు కదా!" అన్నాడు.

అందుకు నఫ్తాలి అందుకొని, "ఔను, ఒకడు తగ్గితే పదిమంది పైకి లేస్తారు. ఒకడు చస్తే ఇరవైమంది బ్రతుకుతారు అనే సామెత అక్షరాల నిజం. ఆ రోజు ఇశ్శాఖారు యోసేపును చంపుతాను అంటే నేనే అడ్డం వెళ్ళాను. కానీ వాడి వల్లే ఈ ఆకలి – ఆ యోసేపు కనిపిస్తే ఇక్కడే, నేనే చంపుతాను" అన్నాడు.

వెంటనే రూబేను కల్పించుకొని "ఆకలి మీతో ఇలాగ మాట్లాడిస్తుంది. ఒక గొఱ్ఱెపిల్లను వధించి ఈ పూట భోజనం చేస్తే గాని మీరందరూ శాంతింపరు. కనుక కొంచెం సేపటికి ఎట్టైనా జెబూలూను, ఇశ్శాఖారు వస్తారు. వారు వచ్చేటప్పటికి వంట తయారు చేస్తాను. ఇక మీరు శాంతిం చండి" అంటూ గొఱ్ఱెపిల్లను తేవటానికి మందవైపుగా వెళ్ళాడు.

ఆకలి గాదుని కూర్చోనివ్వలేదు. యూదా వైపు కోపంగా చూశాడు.

"ఒకడు చస్తే లోకానికి కొదువలేదు. షెకెములో ఒక్క మగవాడినైనా బ్రతుకనివ్వని షిమ్యోను పౌరుషం ఏమయ్యింది? మన తండ్రి యోసేపు తల్లిని అమితంగా ప్రేమించి యూదా తల్లి విషయం ఒక్కమాట కూడా మాట్లాడలేదు. చనిపోయిన ఆమెకోసం బ్రతికి ఉన్న లేయా అమ్మ పిల్లల్ని అన్యాయం చేస్తే ఒక్కరైనా మాట్లాడరు. అందరూ ఏదో ఒకరోజు చస్తారు. అది ఒకరోజు ముందు అయితే నష్టంలేదు. యోసేపు చావాల్సిందే. అప్పుడు కాని మన ఇంట్లో ఉన్న మనుష్యల మధ్య అంతరాలు తొలగిపోవు. మేము ఇంతగా కష్టపడుతూ పస్తులు ఎందుకు ఉండాలి? ఏ కష్టం లేకుండా ఇంట్లో ఉండేవాడు విచిత్రమైన రంగుల అంగీ ఎందుకు ధరించాలి?" అంటూ చేతిలోని కఱ్ఱను గట్టిగా నేలకేసి కొట్టి లేచి వెళ్ళిపోయాడు.

గాదు వెళ్తున్న వైపుగా అందరూ చూశారు. అతడు మామూలు మనిషిగా కనిపించలేదు. సోయరులో నివసించే నరహంతకునిలా కనిపించాడు.

యూదా కొంచెం చలించాడు. ఈ రోజు తన సహోదరుల నోట వచ్చే మాటలు తను మొదటిసారిగా విన్నా, అవి వారి హృదయాంతరాలలో ఏనాటినుండో దాచబడి, నాటుకుపోయిన భావాలుగా అనిపించాయి. 'మిగ్దేల్ – ఏబేరు'లో నివసించేటప్పుడు రూబేను, పిన్నమ్మ బిల్హా కలిసి చేసిన దుష్కార్యము మొదటిసారిగా వెలుగులోనికి వచ్చినప్పుడు కూడా దాను, నఫ్తాలి ఈ విధమైన క్రూరత్వమును చూపలేదు. కొన్నిరోజులు ముభావంగా ఉన్నా, రోజులు గడిచేకొద్దీ అందరూ అన్నీ మర్చిపోయారు. యోసేపు విషయంలో ఏమి జరుగలేదు. కానీ, ఏదైనా జరిగితే తను కాని, రూబేను కాని వారిని వారించలేమేమో అనిపించింది. అయినా యోసేపు తండ్రి దగ్గర ఉన్నంతకాలం అతనికి ఏ ప్రమాదమూ సంభవించదు. చీమ కూడా అతనికి హాని చెయ్యని విధంగా పనివాళ్ళు కాపాడుతూ ఉంటారు. **(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra



# 'నేను తోపుని'



కాలానుగుణంగా పదాల వాడుక కూడా మారిపోతుంది. గతంలో వీరులు, శూరులు అనేవారు. ఇప్పుడు తోపు, తురుము అంటేనే అర్ధమయ్యే పరిస్థితి. ఇవే సినిమా టైటిల్స్‌గా వస్తున్నా యంటే ఈ పదాలు చాలా పాపులర్ అయ్యాయనే అర్థం. కాబట్టి ప్రస్తుత పదాలనే వాడితే మంచిది కదా! ఈ భూమి మీద మనుష్యుల మనుగడ ప్రారంభమైనప్పటి నుండి చాలా మంది తోపులు, తురుములు పుట్టారు, చచ్చారు. భూమి మీద మొదటిగా 'నిమ్రోదు' తోపుగా ఉన్నాడు. అప్పటి నుండి తోపులు పుట్టుకొస్తూనే ఉన్నారు. ఇప్పుడైతే ఎవరికి వాళ్ళే తోపులు. ఎవరికి వాళ్ళు హెచ్చించుకొని తోపులై పోతున్నారు. ఒక మనిషికి గొప్పతనం దేనినిబట్టి వస్తుంది? ప్రపంచంలో ఆడ, మగ తేడా లేకుండా ఏ మనిషైనా తనను తాను హెచ్చిం చుకొనేది మొదటిగా తన ఆరోగ్యాన్నిబట్టి. రోగంతో బాధపడే వాళ్ళు నోరుమూసుకొని ఒక మూలన కూర్చుంటారు. ఆరోగ్యంగా ఉన్నవాళ్ళే రెచ్చిపోతూ రోడ్డెక్కుతారు. తర్వాత తెలివితేటలనుబట్టి హెచ్చించుకుంటారు. ఎక్కడో ఒకటి అరా తప్ప పుట్టే వాళ్ళందరూ తెలివితేటలతోనే పుడతారు. ఈ భూమి మీద మనకంటే తెలివితేటలు ఎవరికీ ఉండరనుకుంటేనే హెచ్చించుకుంటారు. తర్వాత అతి ముఖ్యంగా డబ్బునిబట్టి హెచ్చించుకోనివారు ఉండరు. తెలివితేటలు లేకపోయినా, రోగంతో బాధపడుతున్నా డబ్బుని చూసుకొని తెగ రెచ్చి పోతుంటారు. తర్వాత బలము, అందము, హోదా ఇవన్నీ మనుష్యులని హెచ్చించుకొనేలా చేస్తాయి. ఈ భూమి మీద పుట్టి చనిపోయిన వాళ్ళు, ఇప్పుడు జీవిస్తున్న వాళ్ళు తమను తాము హెచ్చించుకొని 'తోపు'లుగా భావించుకోడానికి వీట న్నిటిలో ఏదో ఒకటి కారణమయ్యేటప్పుడు 'నేను పెద్ద తోపుని' అనటానికి వీటికి మించినది ఏముంది? 'నేను తోపుని' అని అనుకున్న వాళ్ళంతా ఇప్పుడు ఎక్కడున్నారు? అందరూ భూమిలోకి పోయినోళ్ళేగా, మనం మాత్రం ఇక్కడే తిష్టేసుకొని కూర్చుంటామా? మనం కూడా ఏదో ఒకరోజు భూమిలోకి వెళ్ళాల్సిందేగా. ఈ మాత్రం దానికి మొఖానికి మేకప్ కొట్టుకొని, జేబులో డబ్బులు కుక్కుకొని, కండలు పెంచుకొని 'నేనే పెద్ద తోపుని' అని జబ్బ విరుచుకొని తిరగటం అవసరమా? మనల్ని మనం ఎంత ఎత్తుకి హెచ్చించుకుంటామో, దేవుడు మనల్ని అక్కడ నుండి పడేసినప్పుడు అంత పెద్ద దెబ్బ తగిలిద్ది. *'నన్ను క్రిందికి పడద్రోయగలవాడెవడని అనుకొనువాడా, నీ హృదయపు గర్వముచేత నీవు మోసపోతివి. పక్షిరాజు గూడంత యెత్తున నివాసము చేసికొని నక్షత్రములలో నీవు దాని కట్టినను అచ్చటనుండియు నేను నిన్ను క్రింద పడవేతును; ఇదే యెహోవా వాక్కు' (ఓబద్యా 1:3,4).* మనం దేన్ని చూసుకొని 'తోపు'లుగా భావిస్తామో దాని ద్వారానే దేవుడు మనకి కష్టాలు పెడతాడు. దేవుడిచ్చిన ఆరోగ్యం, తెలివితేటలు, టాలెంట్స్‌ని బట్టి దేవునికి కృతజ్ఞత కలిగి ఉండకుండా, మనల్ని మనం తగ్గించుకోకపోతే వచ్చే ఏ కష్టానికైనా, బాధకైనా మనదే బాధ్యత. ఈ లోకానుసారమైన జీవితం జీవిస్తూ కష్టమొచ్చినప్పుడు దేవుని దగ్గరకి వస్తే *'నా సన్నిధిని కనబడవలెనని మీరు వచ్చుచున్నారే నా ఆవరణములను త్రొక్కుటకు మిమ్మును రమ్మన్న వాడెవడు?' (యెషయా 1:12)* అని ఒక్క తన్ను తంతాడు. అప్పుడు తెలిసిద్ది మనం తోపా, తురుమా అని. దేవునికి కృతజ్ఞత కలిగి తగ్గించుకొని, దేవుడు మనల్ని హెచ్చించడం ద్వారా మనం 'తోపు' అని నిరూపిద్దాం.


**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9440217726**

సీరియల్

# మిక్కిలి సాత్వికుడు

**- కొడవటికంటి**

**(మోషే జీవిత చరిత్ర)**

మోషే ప్రార్థించగా దేవుడు సర్పము వంటి ప్రతిమను చేసి స్థంభము పై నిలువబెట్టుము పాము కరచిన వారు దానిని నిదానించి చూచిన బ్రతుకుదురని చెప్పెను. మోషే ఇత్తడి సర్పమును స్థంభముపై నిలువబెట్టగా, పాము కరచి నను విశ్వాసముతో దానిని చూచినవారందరూ బ్రతికిరి.

ఇశ్రాయేలీయులు ఎదోమును చుట్టి అరణ్యమార్గమున అమోరీయుల దేశమును చేరి అమోరీయుల రాజైన సీహోను పొలిమేరలు దాటనివ్వనందున యెహోవా సెలవిచ్చిన ప్రకారం యుద్ధము చేసి అమోరీయుల రాజైన సీహోనును ఆ తరువాత బాషాను రాజైన ఓగును ఓడించి వారి దేశమును స్వతంత్రించుకొని మోయాబు మైదానమును చేరారు.

మోయాబు రాజైన బాలాకు భూతలమును కప్పివేసిన ట్లున్న ఇశ్రాయేలును చూసి భయపడెను. ఇశ్రాయేలీయులు సీహోను ఓగు రాజలను ఓడించారని విని పెతోరులోని బిలాముకు కబురు పంపెను.

బిలాము పెతోరు వాసి. ఇతని తండ్రి పేరు బెయోరు. ఆ కాలంలో బిలాము దీవించువారు దీవింపబడుదురని, బిలాము శపించువారు శపింపబడుదురని మోయాబులో ప్రతీతి. నిజానికి బిలాము ఒక సోదె చెప్పు వాడు.

మోయాబు మైదానము చేరిన ఇశ్రాయేలీయులను శపించు నిమిత్తం తన వద్దకు రావలసిందిగా మనవి చేయుటకు మోయాబు రాజైన బాలాకు బిలామును తీసుకొని వచ్చుటకు మనుష్యులను సొమ్ముతో పంపెను.

యెహోవా బిలామును, మోయాబు పెద్దలతో వెళ్ళుటకు అనుమతినివ్వక పోవడంతో బిలాము తన వద్దకు వచ్చిన వారిని పంపివేసెను. బిలాము బాలాకు ధనమును ఆశించి వెళ్ళదలచినను యెహోవా అనుమతి లేక వారితో వెళ్ళలేకుండెను. బాలాకు మరల తన మనుష్యులను పంపగా యెహోవా బిలాముతో నీవు ఆ మనుష్యులతో వెళ్ళినను ఇశ్రాయేలు ప్రజలను శపించక దీవించ వలసినదిగా ఆజ్ఞాపించెను.

బిలాము తన గాడిదనెక్కి బయలుదేరగా యెహోవా దూత ఖడ్గము ధరించి దారి మధ్యలో నిలబడగా, గాడిద దారి విడిచి పొలములోనికి పోయెను దారి మరల్చవలెనని బిలాము గాడిదను కొట్టెను. దూత అటు ఇటు గోడలు గల ద్రాక్షలతోటను నిలువబడగా గాడిద బిలాము కాలును గోడకు అదిమినందున మరల అతడు గాడిదను కొట్టెను. మార్గములో ఉన్న దూతను చూసి గాడిద కూలబడగా బిలాము మరల గాడిదను కొట్టెను. అందుకు గాడిద నేనేమి చేసితినని ముమ్మారు నన్ను కొట్టితివి అన్నది. గాడిదకు స్వరము కలుగుట చూచిన బిలాము కన్నులు తెరవబడెను. కత్తి దూసి మార్గ మధ్యలో నిలువబడిన దూతను చూసిన బిలాము సాగిలపడెను. దేవుడు ఇశ్రాయేలీయులను శపించుటకు అనుమతివ్వక దీవించెను. కాబట్టి బిలాము ఇశ్రాయేలీయులను దీవించెను.

జనులు షిత్తీములో ఉన్నప్పుడు మోయాబు స్త్రీలను మోహించి వారితో వ్యభిచారము చేసిరి. అంతేకాక ఆ స్త్రీల నిమిత్తం వారి దేవతల బలులకు హాజరవ్వడం, ఆ దేవతలకు నమస్కరించడం చేసిరి. అప్పుడు యెహోవా కోపము ఇశ్రాయేలీయుల మీద రగులుకొనెను. దేవుడు మోషేతో మోయాబు దేవతయైన బయల్పెయోరుతో కలుసుకొనిన ప్రతి వానిని ఉరి తీయవలసినదిగా ఆజ్ఞాపించెను. జనులందరూ ఏడ్చుచుండగా షిమ్యోనీయుడును సాలూ కుమారుడునైన జిమ్రీ, మిద్యానీయురాలైన కొజ్బీ అనే స్త్రీని పాళెములోనికి తీసుకొనిరాగా అహరోను మనుమడును ఎలియాజరు కుమారుడునైన ఫీనెహాసు ఈటె చేత పట్టుకొని వారి వెంబడి వెళ్ళి వారిద్దరి కడుపులో గుండా దూసిపోవునట్లు పొడిచెను. అప్పుడు తెగులు నిలిచిపోయెను. తెగులు కారణంగా అప్పటికే ఇరవైనాలుగు వేల మంది చనిపోయిరి.

దేవుడు ఫీనెహాసు దేవుని యందు ఆసక్తి కలిగి దేవుడు ఓర్వలేనిదానిని తానును ఓర్వలేకపోవుటను బట్టి చేసిన ప్రాయశ్చిత్తము నిమిత్తము అతనితో నిత్య యాజక నిబంధన చేసెను.

ఆ తరువాత దేవుడు మోషేతోను, యాజకుడైన ఎలియాజరుతోను ఇశ్రాయేలీయులను లెక్కించమని చెప్పగా వారి వారి గోత్రముల ప్రకారం ఇరువది ఏండ్ల కంటే పై వయసు కలిగి లెక్కింపబడిన ఇశ్రాయేలీయుల సంఖ్య ఆరు లక్షల వెయ్యిన్ని ఏడు వందలు. మోషే అహరోనులు సీనాయి అరణ్యములో లెక్కించినపడు ఉన్న వారిలో ఒక్కడైనను వీరిలో ఉండలేదు. (కాలేబు యెహోషువ తప్ప)

యెహోవా మోషేతో "నీవు అబారీము కొండ ఎక్కి ఇశ్రాయేలీయులకు నేనివ్వబోయే దేశాన్ని చూడు ఆ తరువాత నీవు కూడా నీ స్వజనులలో చేర్చబడుదువు" అనెను.

మోషే యెహోవాతో "యెహోవా, సమస్త మానవుల ఆత్మలకు దేవా, కాపరి లేని గొఱ్ఱెల వలె ఉండకుండునట్లు సమర్థుడైన వానిని నాయకునిగా నియమించుము" అనెను

దేవుడైన యెహోవా తనకు ఆజ్ఞాపించినట్లు మోషే యెహోషువను యాజకుడైన ఎలియాజరు ఎదుటను, సర్వసమాజము ఎదుటను నిలువబెట్టి అతని మీద చేతులుంచి ఇశ్రాయేలీయులను యొర్దాను అవతలకు నడిపించవలసినదిగా ఆజ్ఞాపించెను.

ఆ సమయంలో మోషే యెహోవాను ఈ విధంగా బ్రతిమాలాడు " యెహోవా నా ప్రభువా, నేను నీ సేవకుడిని, నీవు చేసే ఆశ్చర్యకరమైన, శక్తివంతమైన విషయాలలో కొద్ది భాగం మాత్రమే నీవు నాకు చూపించావు అని నాకు తెలుసు. నీవు చేసిన శక్తి వంతమైన మహత్కార్యాలను చేయగల దేవుడు ఆకాశంలో గాని భూమి మీదగాని లేదు. యొర్దాను నదికి అవతల ప్రక్కనున్న ఆ మంచి దేశాన్ని సౌందర్య వంతమైన ఆ కొండ దేశాన్ని లెబోనానును చూడదానికి నన్ను అవతలకు దాటి వెళ్ళనియ్యి అని నేను నీకు మనవి చేస్తున్నాను"

"కానీ ఇశ్రాయేలీయుల మధ్య మెరీబా నీళ్ళ విషయంలో మోషే దేవున్ని ఘనపరచనందున యెహోవా మోషే మీద కోపగించాడు. ఆయన మోషే మాట వినడానికి తిరస్కరించాడు. యెహోవా మోషేతో ఇలా చెప్పాడు " నీకిది చాలు. ఈ విషయం నాతో ఇంక చెప్పవద్దు. పిస్గా కొండ శిఖరం మీదకి వెళ్ళు తూర్పు పడమర ఉత్తరం దక్షిణము దిక్కులు చూడు. నీవు కళ్ళతో కనాను దేశాన్ని చూడవచ్చు గాని నీవు మాత్రం ఎన్నటికి యొర్దాను నది దాటి వెళ్ళజాలవు. నీవు తప్పక యెహోషువకు హెచ్చరికలు ఇవ్వాలి. అతడిని ప్రోత్సహించి బలపరచు. ఎందుకంటే ప్రజలను యెహోషువ యొర్దాను నది దాటిస్తాడు. దేశాన్ని స్వాధీనంచేసుకొని దానిలో నివశించేందుకు యెహోషువ వారిని నడిపిస్తాడు. ఆ దేశాన్నే నీవు చూస్తావు అంతే"

అందుచేత ఇశ్రాయేలీయులు బేత్పెయోరు అవతలి వైపు లోయలో నిలిచిపోయారు. మోషే చివరిసారిగా ఇశ్రాయేలీయులను పోగు చేసి వారితో ఇలా అన్నాడు " ఇశ్రాయేలీయులారా నేను మీకు ప్రభోదించే చట్టాలు ఆజ్ఞలు వినండి. వాటికి విధేయులవ్వండి. అప్పుడు మీరు బతికి, మీ పూర్వీకుల దేవుడైన యెహోవా మీకు ఇస్తున్న దేశంలో ప్రవేశించి దాన్ని స్వాధీనపరచుకోగలుగుతారు. నేను మీకు ఆజ్ఞాపించిన వాటికి మీరేమి అదనంగా చేర్చకూడదు. నేను మీకు ఇచ్చిన మీ యెహోవా దేవుని ఆజ్ఞలకు మీరు విధేయులు కావాలి.

"బయలు పెయోరు వద్ద యెహోవా చేసింది మీరు చూశారు. అక్కడ బయలును వెంబడించిన వాళ్ళందరిని మీ దేవుడు నాశనం చేశాడు. అయితే మీ దేవుడైన యెహోవా వైపు నిలిచివున్న మీరంతా ఈనాడు బ్రతికి ఉన్నారు"

"చూడండి, నా దేవుడైన యెహోవా నాకు ఆజ్ఞాపించిన చట్టాలు, నియమాలు నేను మీకు ప్రభోదించాను. మీరు ఏ దేశంలోనైతే ప్రవేశించి, దానిని మీ స్వంతం చేసుకోబోతున్నారో ఆ దేశంలో మీరు ఈ చట్టాలకు విధేయులు కావాలని వాటిని నేను మీకు ప్రబోధించాను. ఈ ఆజ్ఞలకు జాగ్రత్తగా లోబడండి. అప్పుడే మీకు జ్ఞానం తెలివి ఉన్నట్టు ఇతర రాజ్యాల ప్రజలకు ఇది తెలియజేస్తుంది. ఆ దేశాల ప్రజలు ఈ ఆజ్ఞలను విన్నప్పుడు "నిజంగా ఈ గొప్ప రాజ్య ప్రజలు (ఇశ్రాయేలీయులు) జ్ఞానులు, తెలివి గలవారు అని చెబుతారు. **(సశేషం)**

# దేవుడు - సిరి

**విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపివేయుడి** కొలొస్స 3:5

ధనాపేక్ష విగ్రహారాధనయైతే, ధనాపేక్ష కలిగి ఉంటే విగ్రహారాధికులమని చెప్పాలి. మోషే మొదటిసారి సీనాయి పర్వతము మీదకి ఎక్కి వెళ్ళి దిగిరావటం ఆలస్యం చేస్తే ప్రజలు అహరోను మీద విరుచుకుపడ్డారు. అహరోను ఇశ్రాయేలీయుల వద్ద నుండి బంగారాన్ని తీసుకొని విగ్రహాన్ని చేశాడు. విగ్రహానికి వారు వేరే ఐగుప్తు దేశపు దేవుళ్ళ పేర్లు పెట్టలేదు. వారందరు ఐగుప్తు నుండి వారిని వెలుపలికి రప్పించిన దేవుడు అన్నారు. అహరోను అయితే ఆ విగ్రహాన్ని యెహోవా అని, రేపు యెహోవాకు పండుగ అన్నాడు. వారి ధనాన్ని (బంగారమును) వారు దేవునిగా రూపొందించారు.

ఈ లోకంలో మనం జీవించినంత కాలము తినటా నికి, కట్టుకోటానికి డబ్బులు కావాలి. నిజమే! యేసు ప్రభువు తన శిష్యులకు నేర్పిన ప్రార్థనలో నేటి అనుదిన ఆహారమును దినదినము మాకిమ్ము అని ప్రార్థించమన్నాడు. కాని నేటి ఆహారమునకు కావలసినంత సొమ్ము మా కిమ్మని అడగ మనలేదు. దేవుని సేవకై మనం ప్రార్థన చేసేటప్పుడు ఫలాన పనికి ఇంత డబ్బు ఇవ్వయ్యా అని అడుగుతుంటాము ఆ డబ్బుతో ఆ పని మనమే చెయ్యాలని. అందువలన ఆ డబ్బులో కొంత మనకు తెలియకుండానే మన కొరకు ఖర్చు అవుతుంది. మనం చేసే పని దేవుడు చెప్పిన పని అయ్యి వుండాలే కాని, మనం ఏదో ఒక పనిని ఏర్పాటు చేసుకొని ఆ పనికై ఆయనను డబ్బులు అడగకూడదు. ఆయనే పని చెయ్యమని చెప్తే, ఆ పనికి డబ్బులు ఇవ్వవలసిన బాధ్యత ఆయనదే కదా! అనేక పనులు మనం చేస్తుంటాము అవన్నీ సేవలో భాగాలే. ఆయన రాజ్యము కొరకే, ఆయన చిత్తము నెరవేరబడుటకే అయితే ఆయనను మనం డబ్బులు అడగటమెందుకు? మనం ఆయన సేవకులము కాబట్టి మన పోషణకై, ఖర్చులకోసం, పిల్లలకోసం ఆయనను అడగటమెందుకు? మనకు ఆయన ఇవ్వాలి ఇస్తాడు. మనం అంతవరకు ఆగలేక ఆయన మర్చిపోయా దేమోనని, ఆయనకు సమయ సందర్భాలు తెలియవని అప్పులు చేస్తాము. అప్పుల వలన తిప్పలు తప్పవు. ఆయన వచ్చి, ఈ నా సేవా సంబంధమైన పని నిన్నెవరు చేయమన్నారు? అంటే ఏమి జవాబు ఇస్తాము. “మీరును, మీకు ఆజ్ఞాపించిన వన్నియు చేసిన తర్వాత మేము నిష్ప్రయోజకులమైన దాసులము. మేము చేయవలసినవే చేసియు న్నామని చెప్పుడి” అన్నాడు (లూకా 17:10). కాబట్టి ఆయన చెప్పే పని గురించి ఆలోచించవలసినదే కాని ఆ పని చెయ్యటానికి కావలసిన ధనమును గూర్చి ఆలోచిస్తుంటే అది మనకు విగ్రహము, దానిని మనం ఆరాధించి విగ్రహారాధికులము అవుతాము. దేవుని పని మన ఆలస్యము వలన ఆగుతుందే కాని డబ్బులేక ఆగదు. ఎలాగైనా ఆయన చిత్తము నెరవేర్చ బడేటప్పుడు మన ఆరాధన ఆయనను గురించి మాత్రమే కాని విగ్రహము మీదకి పోకూడదు.

మన హృదయాన్ని ఏ విషయాలతో నింపుకుంటామో, అది మనకు విగ్రహమవుతుంది. దేవుని సేవకు కావలసిన డబ్బు కొరకు అమితంగా ఆలోచిస్తూ, ప్రార్థిస్తూ, ఇతరులను ప్రార్థించమని అడగటం ఇవి మన హృదయాన్ని ఆయన నుండి దూరం చేస్తుంది. ఒక స్త్రీ కిరోసిన్ కొరకు ఉంచిన డబ్బులు చర్చిలో కానుకగా వేసినది. ఆమె తన బాధ్యతను మరచిపోలేదు హృదయంలో తన అవసరమనే విగ్రహాన్ని తొలగించినందున, ఆమె హృదయంలో ఉన్న యేసుప్రభువు ఆమె అవసరాన్ని (కిరోసిన్) అధికంగా తీర్చాడు.

ధనము కావలసినంత ఉన్నా, ధనాపేక్ష కలిగి ఎంతో సంపాదించినప్పటికీ దేవుని చిత్తము లేకుండా దానిని అనుభవించుట మనకు చేత కాని పని. కాబట్టి ‘సుఖముగా అనుభవించుటకు సమస్తము మనకు ధారాళముగా దయచేయు దేవునియందే నమ్మికయుంచుదాం.



**(మిగితాది 16వ పేజీలో)**

స్త్రీల విభాగము

# రాహాబు

ప్రభువునందు ప్రియ హన్నాకృప పాఠకులకు, ప్రభువైన యేసుక్రీస్తు నామమంలో మీకు శుభములు కలుగు గాక!

పరిశుద్ధ గ్రంథంలో స్థానం సంపాదించిన స్త్రీలలో రాహాబు చాలా చాలా ప్రత్యేకమైన స్త్రీ. ఆమె జీవితాన్ని ధ్యానించుట ద్వారా కొన్ని ఆత్మీయ సత్యాలను తెలుసుకుందాం!

'రాహాబు' అను మాటకు గర్వం లేదా మొండి అని అర్థం. ఆమె యెరికో పట్టణంలో నివసించే కనానీయురాలు. వృత్తిరిత్యా ఆమె ఒక వేశ్య.

రాహాబు అన్యురాలైనప్పటికి దేవుని యందు విశ్వాసము కలిగిన స్త్రీ అనుటకు వేగుల వారితో ఆమె సంభాషణే నిదర్శనం. **"యెహోవా ఈ దేశమును మీకిచ్చుచున్నాడనియు మీ వలన మాకు భయము పుట్టుననియు, మీ భయము వలన ఈ దేశ నివాసులందరికి ధైర్యము చెడుననియు నేనెరుగుదును"** అన్యురాలైన ఒక స్త్రీ దేవుని గురించి అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలిగింది? నేను ఎరుగుదును, నాకు తెలుసు అని అంత దృఢముగా ఎలా చెప్పగలిగింది? ఆమెకు దేవునితో సహవాసం లేదు, దేవుని మాటలు లేవు, అన్య మతాచారాలలో పుట్టి పెరిగిన ఒక స్త్రీ అంత గట్టి విశ్వాసాన్ని ఎలా పొందుకుంది? విశ్వాసాన్ని ఎలా పెంపొందించుకుంది?

అద్భుతకార్యాలు ఆశ్చర్యకార్యాలు చేసిన దేవుడు తమతో ఉండినను, ఆయన శక్తి సామర్థ్యములు ఎప్పటికప్పుడు రకరకాల గొప్ప కార్యాలతో ఆయన తెలియజేసినప్పటికి ఇశ్రాయేలీయులు దేవున్ని నమ్మక, ఆయనను ఎరుగక, ఆయనపై తిరుగుబాటు చేసి అరణ్యములోనే చనిపోయారు.

నిజదేవున్ని కలిగియున్న మనము రాహాబువలె మన దేవున్ని ఎరిగియున్నామా? ఆయన శక్తిని సామర్థ్యతలను నిజముగా మనము ఎరుగుదుమా? తన బిడ్డల పట్ల ఆయన వైఖరి మనకు తెలుసునా? ఆయనను మనం వ్యక్తిగతంగా తెలుసుకొనవలసిన ఆవశ్యకత ఉన్నదని గుర్తించగలరు.

రాహాబు ఇశ్రాయేలీయుల నిమిత్తం దేవుడు ఐగుప్తులో చేసిన కార్యములను గూర్చి విన్నది. **"మీరు ఐగుప్తు దేశంలో నుండి వచ్చినపుడు మీ యెదుట యెహోవా ఎఱ్ఱ సముద్రపు నీరును ఏలాగు ఆరిపోచేసెనో... ఆ సంగతి మేము వింటిమి"** రాహాబు వృత్తిరిత్యా వేశ్య కావడం వలన అనేక దేశాల వారు ఆమె యొద్దకు రావడం సంభవించి యుండ వచ్చు అలా వచ్చిన అనేక దేశాల వారి వలన ఆమె విని ఉండవచ్చు అయితే రాహాబు వేగులవారితో మాటాలాడిన సమయానికి ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి వచ్చి నలభై సంవత్సరాలు అవుతుంది. అంటే రాహాబు దేవుడు ఐగుప్తులో చేసిన ఆశ్చర్యకార్యములను గూర్చి విని దాదాపు నలభై సంవత్సరాలు అయి ఉంటది. ఆమె విన్న సంగతులను ఆమె ఎంత జాగ్రత్తగా గుర్తుపెట్టుకున్నదో కాదా! కేవలం గుర్తు పెట్టుకోవడమే కాదు ఆమె దేవుని గురించి, దేవుడు ఇశ్రాయేలీయుల ప్రజలకు చేసిన కార్యములను గురించి ఆలోచించి ఉండవచ్చు. లేకుంటే అన్ని సంవత్సరములకు ముందు విన్న విషయం ఎవరికీ గుర్తుండదు. నిజానికి కొన్ని సంవత్సరాల సమయం గడిస్తే మనకు జరిగిన విషయాలే గుర్తుండవు మరి విన్న విషయం గుర్తుందంటే ఆమె ఎంతగా ధ్యానించి ఉంటుందో. ఎంత ఆసక్తి లేకుంటే ఆమె అన్ని సంవత్సరాలు దేవుని గురించి వినిన సంగతులను ధ్యానించి ఉండవచ్చు. అది కూడ దేవుని గురించి చెప్పే వారు లేరు, కనీసం సంభాషించడానికి కూడ ఎవరూ ఉండి ఉండక పోవచ్చు.

మనము అనుదినము బైబిలు చదువుతున్నప్పటికి, ప్రతి ఆదివారం చర్చికి వెళ్తున్నప్పటికి మనము దేవుని వాక్యమును గుర్తుపెట్టుకోము, దానిని ధ్యానించము. మనకు మన దేవుని పట్ల నిజ ఆసక్తి ఉన్నదా?

రాహాబు ఆసక్తి, ఆమెను దేవుని గురించి తెలుసుకునేలా చేసింది. **"మేము వినినపుడు మా గుండెలు కరిగిపోయి నవి"** అన్నది. గుండెలు కరగడం అంటే ఏమిటి? దేవుని శక్తి సామర్థ్యాలు తెలుసుకున్న తరువాత ఆయన యొక్క

సర్వశక్తిని గ్రహించినందున దేవునికి మిక్కిలి భయపడింది అని చెప్పవచ్చు. దేవుని యందు భయమును, విశ్వాసమును కలిగిన స్త్రీ అని ఇందునుబట్టి చెప్పవచ్చు.

వచ్చిన వారు వేగులవారని, ఇశ్రాయేలీయులని ఆమెకు ముందుగా తెలియదు. యెరికో రాజు పంపిన మనుష్యుల ద్వారా తెలుసుకొనిన రాహాబు అతి తక్కువ సమయంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించి వేగుల వారిని జనుప కట్టెలో దాచిపెట్టింది. అంతేకాక వచ్చిన వారు వెళ్ళిపోయా రని చెప్పి యెరికో మనుష్యులను పంపివేసింది. వాస్తవానికి ఆ వేగుల వారు రాహాబును సహాయం చేయమని అడగలేదు. రాహాబుకు వారు ఇశ్రాయేలీయులు అని తెలియగానే ఆమె యెరికో రాజును, రాజు పంపిన మనుష్యులను, రాజాజ్ఞను ధిక్కరిస్తే వచ్చే సమస్యలు శ్రమల గురించి ఒక్క క్షణము కూడ ఆలోచించలేదు భయపడలేదు. ఇశ్రాయేలీయుల దేవుడు యెరికో రాజు కంటే గొప్పవాడని నమ్మింది కనుకనే యెరికో రాజు మాటను లెక్కచేయక వేగులవారిని దాచింది.

రాహాబు తమ ఉన్న పరిస్థితిని, లోకానుసారమైన స్థితి గతులను కాక వాటికి అతీతుడును, వాటిపై సర్వాధికారి యైన దేవునియందు విశ్వాసముంచి ఇశ్రాయేలీయులకు సహాయపడింది. మరి లోకంలో జీవిస్తున్న మనం నిరంతరం ఏదో ఒక సమస్యను ఎదుర్కోవలసి వస్తుంది. అలాంటప్పుడు మనం మన చుట్టూ ఉన్న పరిస్థితిని చూచి భయపడు తున్నామా? భయపడుతూ దేవుని కొరకు నిలబడక మనమూ లోకానుసారంగా జీవిస్తూ సర్దుకుపోతున్నామా? లేక రాహాబువలె పరిస్థితులకు అతీతుడైన దేవునియందు విశ్వాసము కలిగి ప్రవర్తిస్తున్నామా? అని అనుదినము మనలను మనం పరీక్షించుకోవాలి.

**"మీ దేవుడైన యెహోవా పైన ఆకాశమందును క్రింద భూమియందును దేవుడే. మీ ఎదుట ఎట్టి మనుష్యులకైనను ధైర్యమే మాత్రము ఉండదు"** రాహాబు దేవునియందు విశ్వాసాన్ని బట్టి రాబోవు సంగతులను గ్రహించింది. అందుకే ఇశ్రాయేలీయులు యెరికోను ఆక్రమించునపుడు తనను తన తల్లిదండ్రులను, అక్కచెల్లెలు, అన్నదమ్ములను బ్రతుకనిమ్మని తన ఉపకారమునకు ప్రతిఫలముగా వేగుల వారిచే ప్రమాణం చేయించుకున్నది. వేగుల వారి మాట ప్రకారం తన ఇంటి కిటికీకి ఎర్రని తొగరు దారమును కట్టి తన ప్రాణము తన ఇంటి వారి ప్రాణమును కాపాడు కున్నది. యెరికో ప్రాంతమంతా నాశనము అయినను రాహాబు కుటుంబము రక్షింపబడినది. ఇశ్రాయేలీయుల మధ్య నివసించింది, ఒంటరియై వేశ్యగా బ్రతుకుతున్న ఆమెకు దేవుడు భర్తను కుటుంబమును ఇచ్చాడు.

ఒక అన్యురాలు, వేశ్య అయిన రాహాబు కేవలం దేవుని గురించి విని విశ్వాసాన్ని పొంది భర్తను, కుటుంబమును పొందుకొనుటే మాత్రమే కాక పరిశుద్ధ గ్రంథములో స్థానం సంపాదించింది, విశ్వాసవీరుల జాబితాలో స్థానం పొంది నది, యేసుక్రీస్తు వంశావళిలో చేర్చబడినది. ఎంత ఆశ్చర్యమో కదా!

ప్రియ చదువరీ ! నీవు ఏ స్థితిలో ఉన్నప్పటికి ఎటువంటి పరిస్థితులలో జీవిస్తున్నప్పటికి, ఈ లోకం దృష్టిలో ఎంతో హీనమైన, దుర్భర పరిస్థితులలో (శారీరకంగా/మానసి కంగా) ఉన్నప్పటికి రాహాబు స్థితిని మార్చిన దేవుడు నీ స్థితిని మార్చడానికి సిద్ధముగా ఉన్నాడు. అయితే నీవు కూడా రాహాబువలె దేవునికి నీ హృదయంలో చోటివ్వాలి. ఆయనయందు విశ్వాసముంచాలి.

క్రైస్తవులమై దేవుని ఎరిగిన వారమైన మనము కూడా రాహాబువలె విశ్వాసపు క్రియలు కనపరచుటకు సిద్ధముగా ఉండాలి. అట్టి జ్ఞానమును, ధైర్యమును పొందునట్లు ఆ దేవుడు మనకందరికి సహాయము చేయును గాక! ఆమేన్!

## గమనిక

**పాఠకుల నుండి కవితలు, కథలు కోరబడు చున్నవి. ఉత్తమ కవితలు, కథలకు బహుమతి కూడా ఉంటుంది. ఒక తావు (రెండువైపులా) మించకుండా వ్రాసి 20వ తేది లోపు మాకు చేరేలా పంపించండి. లేదా స్కానింగ్ చేసి మా ఈ-మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.** kerajendra@gmail.com

# సాక్ష్యము

నాపేరు వై.పద్మాదేవి. పూనూరుగ్రామం. ప్రకాశంజిల్లా యద్దనపూడి మండలం. మా తండ్రి పేరు బోయిన సుబ్బారావు, తల్లి మహాలక్ష్మిల నాల్గవ సంతానంగా హిందూ కుటుంబంలో జన్మించి, విగ్రహారాధనలోనే కొనసాగాను. తల్లి గర్భంలో పిండంగానే పడిపోవలసినదానను, పుట్టాక మా కులంలో ముగ్గురు అబ్బాయిల తరువాత అమ్మాయి పుడితే ఇంటికి అరిష్టం వడ్లగింజవేసి చంపమన్నారు. నాతండ్రి అంత ధైర్యం చెయ్యలేకపోయిన దానినిబట్టి దేవుని అనాది సంకల్పం నాపట్ల కలిగి వున్న దానినిబట్టి నేను బ్రతికి బట్ట కట్టినాను. అయితే ఇవేమి అప్పుడు నాకు తెలియవు కాబట్టి నా తల్లిదండ్రుల దేవతలనే నేనూ ఆరాధిస్తూ చాలా మంచి భక్తిపరురాలిని అని మురిసిపోయే దానను. తల్లి ఎంతో కట్టుదిట్టంగా పెంచినప్పటికిని నా హృదయంలో అవిదేయత, తిరుగుబాటుతనం, ప్రేమలేని స్థితి, ఈర్ష్య, అసూయ, పగతీర్చుకొనే స్వభావం, తినడానికి డబ్బు దొరకక పోతే దొంగతనం సైతం చేసేదానను. ఇంకా చెప్పలేనంత మురికితో జీవించాను. ఇలావుంటూ నేను ఆల్‌రైట్, చాలా మంచిదానను, ఎదుటివారందరు చెడ్డవారు. ఇదే నాహృదయ స్థితి 16 సంవత్సరాల వరకు సాగింది.

బాగా తినాలి, త్రాగాలి, అనుభవించాలి, ఎక్కువ సినిమాలు చూడాలి, మంచి ఖరీదైన జీవితం, చక్కటి భర్త ఏవేవో ఊహలు, అయితే మంచి లేనిదాననైనా... మంచిగా మారాలి అనే కోరిక అంతరంగపు లోతుల్లో ఎక్కడో దాగి వుంది. అనేకులను ఆదర్శంగా తీసుకుని అలా వుండాలని చాలా ప్రయత్నించి విఫలం అయ్యాను. ఇది నాజీవితంలో సాధ్యం కాదని విడిచి పెట్టాను. తోటి యవ్వనులు స్వేచ్ఛగా వుంటుంటే నేను అలా వుండడానికి విడిచిపెట్టని అమ్మను ఎంతో ద్వేషించేదానను.

ఎవరి సువార్త మూలంగా నేను రక్షణ పొందలేదు, ఆపదకాదు, వ్యాధికాదు. బలవంతంగా కాదు, కేవలం ఒక్క స్త్రీ యొక్క (దీనమ్మ) మాదిరికరమైన ప్రవర్తన, జీవితం నన్ను సిలువ వైపుకు నా ప్రమేయం లేకుండా త్రోసుకుని వెళ్ళాయి, (ఇదీ అనాది సంకల్పంలో భాగమే) అప్పుడు బైబిల్ చదవడం, వాక్యం రేడియోలో వినడం, ప్రార్థించడం ఆరంభిస్తే. బైబిల్ నన్ను పాపిగా, దోషిగా హృదయవ్యాధి కలిగిన దానిగా, ఏ మంచిలేని దానిగా ఋజువు చేసింది. అప్పుడు నా పాపాలన్నీ ప్రభువునాకు బయలుపరచిన దానిని బట్టి అన్నీ దేవుని యెదుట ఒప్పుకోవడమే కాక మనుష్యుల దగ్గర సైతం (పరీక్షల్లో వ్రాసిన కాపీలతో సహా) ఒప్పుకొని విడిచిపెట్టాను. ఆ క్రొత్త జీవిత ఆరంభం ముందెన్నడూ లేని సంతోషాన్ని, సమాధానాన్ని నాకిచ్చింది. అందరితో మంచిగా వుండడాన్ని నాకు నేర్పింది. లోకం నుండి వేరు కావాలనే కోరిక బలీయంగా కలగనారంభించింది. (కొంచెం కొంచెంగానే నాలో మార్పు జరిగింది. ఇప్పటికీ నేను మార్చుకోవలసింది మిగిలి వున్నట్లుగా నేను గ్రహిస్తాను) అలా వేరైన కొద్దీ దేవునితో నాస్నేహం బలపడసాగింది. నాకంటూ (దేవునితో) ఒక ప్రపంచం సృష్టించుకొని అందులో దేవుడు నేను మాత్రం కలుసుకుంటూ వుండేవారము. ఆయన ప్రతిరోజూ నాతో మెల్లని స్వరం ద్వారా మాట్లాడుతూ నన్ను సరిచెయ్యడం ఆరంభించారు. విన్న మాటకు విన్నట్లుగా లోబడేదానను. అప్పుడు నాకు కలిగే హృదయానందం వర్ణనాతీతం సంఘ సహవాసాన్ని నేను కలిగిలేను అనే విషయం గమనించాలి. యవ్వనస్తులు చర్చీలకని వెళ్ళి రోడ్డుల మీద తిరగకూడదని నన్ను ఇంట్లోనే వుంచారు.

1987లో నా19వ సంవత్సరంలో పూర్తిగా అన్యుడైన (వై.యు. రమణ) చేతిలో భార్యగా పెట్టబడినాను. నేను ప్రార్థన చేసుకుంటానని ముందే చెప్పారు నా తల్లిదండ్రులు, వారు కూడా ప్రార్థన వరకు అభ్యంతరంలేదు గాని చర్చీకి మాత్రం వెళ్ళడం కుదరదు అని ఖండితంగా ఆజ్ఞాపించారు. అప్పుడు ప్రభువా ఒక అన్యుడి చేతికి ఎందుకు అప్పగించావు

నన్ను అని ప్రశ్నించాను. ప్రభువు నాతో మెల్లని స్వరం ద్వారా.... దీపం లేని స్థలంలో నిన్నొక దీపంగా చేస్తాను అన్నారు. అంతే ఆ మాటను ఆధారం చేసుకుని బ్రతుకు తున్నాను. అన్యుల ఆచార వ్యవహారాల్లో నేను కొనసాగలేక పోయేదానను. అందునుబట్టి ఎన్నో సమస్యలు, వత్తిళ్ళు, పోరాటాలు ఎదుర్కోవలసి వచ్చింది. ఓడిపోయాను, చచ్చి బ్రతికాను, రాజీపడ్డాను. కానీ క్రీస్తును మాత్రం నా హృదయంలో నుండి పోగొట్టుకోలేదు. స్తోత్రం ఇద్దరు మగ పిల్లలనిచ్చి ప్రభువునన్ను దీవించారు. అయితే నేను వారికి లోబడి జీవించిన దానునుబట్టి అత్తింటివారు పిల్లలకు క్రీస్తుని నేర్పే విషయమై అభ్యంతర పెట్టలేదు. నా పిల్లలిద్దరికి క్రీస్తుని బాల్యంలోనే నేర్పుకునే భాగ్యం నాకు కలిగింది. మేము చిన్నగంజాం నుండి ఒంగోలుకు వచ్చాము.

ఒక సమయంలో అనుకోకుండా స్టువర్ట్‌పురంలో జాషువాడానియేల్‌గారి మీటింగ్స్‌కి నాభర్త దగ్గర పర్మిషన్ తీసుకొని వెళ్ళాను. ఆ తొలి అనుభవంలోనే ప్రభువు నన్ను ముట్టినారు. 'ప్రేమ శ్రేష్టమైనది' అనే పుస్తకము ద్వారా పట్టబడినాను. క్రైస్తవ్యం అంటేనే ప్రేమ అని, ప్రేమలేనివాడు దేవునికి సంబందించినవాడు కాడని నేర్చుకున్నాను. ఎంతో కొంత ప్రేమ నాలో ఆరంభమైంది అది మాదిరి జీవితంగా నా భర్త గమనించి కాస్తంత స్వేచ్చను ఇచ్చాడు. భక్తి జీవితంలో, ఆసమయంలోనే మైకేల్‌గారు అనే దైవజనుడి పరిచయం, ఆయన వారానికి ఒకమారు వచ్చి వాక్యం చెప్పడం, దేవునితో ఎలా వుండాలి, భక్తి ఎలా చెయ్యాలి అనే అనుభవాలు నేర్పినాడు, ఆ తరువాత ఎరుగకుండానే నాలో దైవాత్మ పనిచెయ్యనారంభించింది. నా చుట్టూ వున్న నశించిపోతున్న ఆత్మల కొరకు ఎంతో కన్నీరు కార్చడం జరిగేది, అలా ప్రార్ధించినప్పుడు ఒక్కొక్కరూ నావైపు ఆకర్షించబడడం వారికి ప్రేమతో పాటు ఆదరణ, కాస్తంత దైవ వాక్యం చెప్పి ప్రార్ధించి పంపేదాన్ని. దేని కొరకు ప్రార్ధించామో దానిని పొందేవారము. అదినాకు చాలా విచిత్రంగా అనిపించేది దేవుడు ఇస్తున్నాడు కదా అని... ఒక కుంటి పిల్ల (రెండు కాళ్ళు చచ్చుబడిన) నడవాలని ప్రార్ధించాను. కొన్ని దినములలో నడిచింది. ఇంకా అద్భుతం దేవుడు దేనినైనా చేస్తాడు అనే గ్రహింపు వచ్చింది. అయితే ఏ మంచిలేని నేను ప్రార్ధించినప్పుడు ఇలా ఎందుకు చేస్తున్నావు? అని ప్రశ్నించాను దేవున్ని. 2దిన. 7:12 ద్వారా ప్రభువు నాతో మాట్లాడినాడు. ఈస్థలం కోరుకుని పరిశుద్ధ పరిచాను, ఇక్కడి ప్రార్ధన మీద నా కనుదృష్టి వుంటుంది. నా చెవులు దానిని ఆలకిస్తాయి. అనే వాక్యం ద్వారా మాట్లాడి నప్పుడు కృతజ్ఞతతో నాహృదయం పగిలింది. కన్నీరు ఏరులైంది. దానితోనే ఆయన పాదాలు తడిపి స్తుతించాను.

అంతేకాక ఒకరోజు నిద్రిస్తున్న నన్ను ఎవరో తట్టిలేపారు అక్కడ ఎవ్వరు లేరు. కాని ఒక స్వరం యెషయా 60వ అధ్యాయం చదువు అని చెప్పడం విన్నాను. లెమ్ము తేజరిల్లుము నీకు వెలుగు వచ్చియున్నది. అలా ప్రభువు నన్ను సేవకు పిలిచారు. ఆ తరువాత అనేకమైన వాగ్దానాలు, దర్శనాల ద్వారా, కలల ద్వారా ప్రభువు నన్ను సిద్ధపరిచాడు. నా ప్రార్ధన ఫలించి నా భర్త బాప్తిస్మానికి పర్మిషన్ ఇవ్వటం జరిగింది. బాప్తిస్మం తీసుకున్నాను. ఇప్పుడు సేవ కొనసాగి స్తున్నాను. నా దగ్గరకు వచ్చిన వారితో రోజూ ఒకగంట ప్రార్ధనా పరిచర్య ఆరంభించమని (పీటర్‌పాల్‌గారు గుంటూరు, యల్.ఇ.యఫ్) ద్వారా ప్రభువే నన్ను హెచ్చ రించారు. దాదాపు మూడు సంవత్సరాలు రోజు 3గం॥లు మిద్దె మీద ఎండలోనే (ప్రక్కింటి చెట్టు నీడకొంచెం వుండేది) 5 వరకు ప్రార్ధించేవారము. దేవుడు ఇంకా గొప్పకార్యాలు చెయ్యనారంభించాడు. అనేక ఆత్మలు అక్కడికి ఆకర్షించ బడ్డాయి. రోగులు బాగవుతున్నారు, దయ్యాలు వెళ్ళి పోతు న్నాయి. ఏసమస్య అయినా పరిష్కారం అవుతుంది. అయితే జయ జీవితంలేనిదాన్ని కాబట్టి సాతానుతో పోరాడడం నాకు చేత కాలేదు. తరచూ వ్యాధి బాధలు, సమస్యలు, పోరాటాలు, ఇంట్లో అసమాధానం ఎన్నో విషమపరిస్థితులను ఎదుర్కో వలసి వచ్చింది. పరిస్థితి ఇలా ఎందుకుందో నాకు తెలియక పోయినా కలగినదాన్ని గట్టిగా పట్టుకుని శోధనకాలం దాటుకోవడానికి ప్రభువు కృప నిచ్చాడు. దేవునికి స్తోత్రము, మహిమ చెల్లును గాక! ఆమేన్.

# కొండలను కదిలించు ప్రార్థన

**"మీరు విశ్వాసము కలిగి సందేహపడకుండిన యెడల ఈ అంజూరపు చెట్టునకు జరిగిన దానిని చేయుట మాత్రమే కాదు, ఈ కొండను చూచి – నీవు ఎత్తబడి సముద్రములో పడవేయబడుదువు గాకని చెప్పిన యెడల అలాగు జరుగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను**" మత్తయి 21:21

ప్రార్థన లేని క్రైస్తవుడు శక్తిలేని క్రైస్తవుడు అని ఒక గొప్ప దైవజనుడు అన్నాడు. ప్రార్థన ముఖ్యముగా పట్టుదలతో కూడిన ప్రార్థన ద్వారా అనేక అద్భుత కార్యములు జరుగుట చూడగలము. 2రాజులు 19వ అధ్యాయంలో యూదా రాజైన హిజ్కియా, అష్షూరు రాజైన సన్హెరీబు విస్తారమైన సైన్యముతో తనపైకి దండెత్తిరాగా భయపడి, దైవసన్నిధిలో తనను తాను తగ్గిశ్రీచుకొని విజ్ఞాపన చేయగా, దేవుడు హిజ్కియా ప్రార్థనను విని తన దూతను పంపి అష్షూరు వారి దండుపేటలోని 1,80,000 మందిని హతమార్చుట ఎంతో ఆశ్చర్యకరమైన విషయం. అంతేకాదు 2రాజులు 20వ అధ్యాయంలో హిజ్కియా దేవుని సన్నిధిని ప్రార్థించి 15 సం॥ల ఆయుష్షు పొందుట చూడగలము. క్రొత్త నిబంధనలో అపొ.కా. 12వ అధ్యాయంలో హేరోదు పేతురును చెరసాలలోనే యుంచి అతని చంపదలచగా సంఘము అతని కొరకు అత్యాసక్తితో ప్రార్థించెను. దేవుడు ఆ ప్రార్థన విని తన దూతను పంపి చెరసాలలో నుండి పేతురును రక్షించుట చూడగలము. మచ్చుకు ఈ సంఘటనలు మనం జ్ఞాపకము చేసుకున్నాము. అయితే ప్రార్థన ద్వారా జరిగిన అద్భుతములను మనం కోకొల్లలుగా చూడవచ్చును.

అయితే మత్తయి 21:21 చదివినపుడు మనకు కొన్ని ప్రశ్నలు తలెత్తవచ్చును. ఏనాడైనా ఎవరి ప్రార్థన వలనైనా ఒక్క కొండయైనా లేచి సముద్రంలోపడుట విన్నామా? చూచామా? అట్టి కార్యం ఎన్నడూ జరుగలేదు. కారణం ఏమిటి? ప్రభువు అక్షరార్థంగా కొండలను గురించి మాట్లాడుచున్నాడా? అలాగైతే రక్షింపబడిన ప్రతివాడు తమ విశ్వాసమును కొండలపై ప్రయోగించి ఉండేవాడు. ఈ దినములలో మన విశ్వాసమును పరీక్షించుకొనుటకు టక కొండ కూడా మిగిలి ఉండేది కాదు. మత్తయి 21:21లో ప్రభువు పలికిన మాటల ఉద్దేశ్యం పూర్తిగా వేరు అని మనం గ్రహించాలి. దేవుడు మన వేడుక కొరకు ఏ కార్యమును చేయడు. అంతేకాదు ప్రభువుకు మహిమార్థంగా లేని ఏ కార్యమును ప్రార్థన ద్వారా జరుగుటకు దేవుడు అనుమతించడు. ఆయన ప్రార్థనకు జవాబు ఇస్తాడు. అట్టివి ఎంత కష్ట సాధ్యమైనను కొండలవంటి సమస్యలైనను అవి పెకిలించబడతాయి. మరియొక విషయం ఏమంటే, ఒక వ్యక్తి నిజంగా పశ్చాత్తాపపడి తన పాపముల విషయం ప్రభువును క్షమాపణ వేడుకున్నప్పుడు ఆయన క్షమించి కొండలవలె పేరుకు పోయిన పాపములను ఆయన మరి జ్ఞాపకము చేసుకొనకుండా వాటిని సముద్రపు అగాధంలో పడవేయును (మీకా 7:19).

**ప్రభువు చిత్తప్రకారము ప్రార్థించుట:** ఈ రోజుల్లో చాలా మంది తమ ప్రార్థనలకు ఎన్నో జవాబులు వస్తున్నాయి అని చెప్తున్ననూ నిజానికి కొన్ని విషయాలలో ఎంతోకాలంగా జవాబు రాక, "ఎందుకు ఈ విషయంలో దేవుడు నా ప్రార్థన వినడంలేదు?" అని తమ హృదయాలలో తలుస్తూ ఉంటారు. దేవుడు ప్రతి వ్యక్తినీ ఒక ప్రత్యేక ఉద్దేశ్యంతో సృజించాడని మొదట మనం గ్రహించాలి. ఒక బిడ్డకు తన జీవితంలో దేవుని చిత్తాన్ని గ్రహించగలిగిన రోజుకన్నా సంతోషకరమైన రోజు మరియొకటి ఉండదు. ఆ తరువాత ఆ వ్యక్తి జీవితంలో సమస్తము తన మేలు కొరకు సమకూడి జరుగుట (రోమా 8:28) తాను చూడగలుగును. అందుకే మత్తయి 6:10లో ప్రభువు నేర్పినట్లు ఆయన చిత్తప్రకారము జరుగవలెనని మనం ప్రార్థింప బద్ధులమైయున్నాము.

అపోస్తలుడైన యోహాను పత్మాసు ద్వీపమునకు పరవాసిగా కొనిపోబడుటకు తీర్పుతీర్చబడగా సంఘము తన కొరకు ఎంతగానో ప్రార్థించియుండును. కాని యోహాను విడుదల చేయబడలేదు. కారణం ఏమంటే దేవుడు లోకమునకు

యోహాను ద్వారా ఒక గొప్ప ప్రత్యక్షీకరణ గ్రంథమును అనుగ్రహించుట దేవుని చిత్తము. అందుకే దేవుడు యోహానును పత్మాసు ద్వీపమునకు కొనిపోయెను. దైవజనుడైన జాన్‌బన్యన్ జైలులో వేయబడగా నాటి సంఘము అతని విడుదల కొరకు ఎంతగానో ప్రార్థించెను. కాని దేవుడు వారి ప్రార్థన అంగీకరించలేదు. అనేక సం॥లు ఖైదు జీవితం అనంతరం జైలులో తాను వ్రాసిన ప్రఖ్యాత "యాత్రికుని ప్రయాణము" అను పుస్తకంతో అతడు బయటకు వచ్చెను. కోట్లాది క్రైస్తవులకు ఆ గ్రంథము ఎంతో ప్రయోజన కరముగా ఉన్నది. జైలుగదులలో దేవుడు జాన్‌బన్యన్‌కు ఇచ్చిన అద్భుత దర్శనమే ఆ గ్రంథము.

ఆదికాండంలో మనం యోసేపు జీవితమును గమనించినట్లయితే, అతడు దేవునికి ఎంతో నమ్మకముగా జీవించిననూ తన సహోదరులచే ఇష్మాయేలీయులకు అమ్మబడి ఐగుప్తునకు కొనిపోబడుట, అచట పోతీఫరుచే కొనబడి అతని ఇంటిలో బానిసగా ఉండుట అనునట్టి హృదయవిదారక సంఘటనలు తన జీవితంలో జరిగెను. పోతీఫరు ఇంట బానిస జీవితంలో దేవుడు యోసేపును దీవించగా, అతడు తన యజమాని మన్ననలు పొంది ఆ ఇంటి గృహ నిర్వాహకుని స్థితికి చేరెను. దేవుడు తన ప్రార్థన విని ప్రతిస్థితిలో తనను కాపాడి హెచ్చించెనని యోసేపు తలంచియుండును. ఆ సమయంలో అతడు పోతీఫరు భార్యచే శోధింపబడి శోధనలో దేవునికి నమ్మకముగా ఉండగా దేవుడు తనను మరి ఎక్కువగా ఆశీర్వదించుననియు పోతీఫరు భార్య చేసిన అన్యాయము బయటపడుననియు అతడు తలంచి యుండును అయితే అలా జరుగలేదు. అతడు చెరసాలలో ఉండగా రాజు సేవకులైన పానదాయకుడు, భక్ష్యకారుడు నేరము చేసి, చెరసాల పాలైరి. అక్కడ వారు వారిరువురు కలలు కనగా, యోసేపు వారి కలల భావము తెలిపెను. దాని ప్రకారము వారికి జరిగెను. భక్ష్యకారుడు మరణ శిక్షనొందగా, పానదాయకుని ఉద్యోగము తిరిగి అతనికి ఇవ్వబడెను. ఆ సమయమందు యోసేపు పానదాయకునికి తన విషయం తెలియజేసి రాజుతో తన గురించి మాటలాడి తనను బయటకి రప్పించమని వేడుకొనెను.

చెరసాలలో యోసేపు తన విడుదల నిమిత్తము ఎంతో ప్రార్థించి యుండును. తన భవిష్యత్తు అంధకారముగా ఉండెను. ఆ సమయంలో చెరసాలకు పానదాయకుడు, భక్ష్యకారుడు వచ్చుట, వారు కలలు కని యోసేపు ద్వారా ఆ కలల భావం తెలుసుకొనుట, తాను చెప్పిన రీతిగా జరుగుట చూచినప్పుడు యోసేపు జీవితంలో గొప్ప ఆశలు చిగిరింపజేసెను. పానదాయకుడు చెరసాల నుండి బయటకు వెళ్ళినది మొదలు పానదాయకుడు తన గురించి రాజుతో మాటలాడనయు, తనకు విడుదల సమీపించుననియు, తన తండ్రియొద్దకు, తన ఇంటికి తిరిగి వెళ్ళుటను గూర్చి తలంచి ఆనందించి ఉంటాడు. అయితే యోసేపు కోరిక, అతని ప్రార్థన నెరవేర లేదు. అతడు ఎంతో ఎదురు చూచి నిరాశకు గురై ఉంటాడు. తనకు వచ్చిన ఒకే ఒక అవకాశం నిరూపయోగమాయెను. అది తన మనసును ఎంతో కృంగదీసియుండును. పానదాయకుడు యోసేపును గూర్చి మరచిపోయెను. ఇది నమ్మలేని విషయం. అయినా అది దేవుని చిత్తం. ఒకవేళ యోసేపు కోరినట్టుగా దేవుడు ఆ సమయమందు యోసేపుకు విడుదల అనుగ్రహించి నట్లయితే, అతడు విడుదల చేయబడి తన తండ్రి ఇంటికి తిరిగి వెళ్ళి మరలా గొఱ్ఱెలు కాయువాడై యుండును. కాని దేవుని చిత్తము యోసేపు పట్ల వేరుగా ఉండెను. అది ఎంతో ఉన్నతము. దేవుడు ఆ ఎత్తయిన కొండను తొలగించి, యోసేపును విడిపించి ఐగుప్తు ఏలికగా చేసి కరువు కాలమందు ఐగుప్తు ప్రజలను, తన సొంత జనాంగమును రక్షించుట దేవుని చిత్తము.

ఆహా! దేవుని తలంపులు ఎంత గంభీరములు! ప్రియ విశ్వాసీ నీ ప్రార్థనలకు జవాబు రాకపోవుట వలన విచారిస్తున్నావా? దేవుని చిత్తము నీ జీవితంలో జరుగవలెనని ప్రార్థించుము. దేవుడు అత్యుత్తమమైనది నీకు అనుగ్రహించును. దేవా మా ప్రణాళికలను, మా ఉద్దేశ్యములను దీవించుము అని కాదు గాని, దేవా నీ చిత్తానుసారముగా నా మార్గములు మలచబడి నేను దీవెన నొందుటకు సహాయము చేయుము అని ప్రార్థించుట నేర్చుకుందాము. అదియే నిజముగా కొండలను కదిలించు ప్రార్థన దేవుడు మిమ్మును దీవించును గాక!

చిన్నపిల్లల పేజి

# మేరీజోన్స్

హాయ్! పిల్లలూ ఎలా ఉన్నారు? ఈ సంచికలో ఎంతో ప్రత్యేకమైన కథను మీతో పంచుకోవాలని ఆశపడుతు న్నాను. ఎందుకంటే ఇది మీలాంటి ఒక చిన్న పాప కథ. ఇది 18వ శతాబ్ధంలో జరిగిన యథార్థ సంఘటన.

బ్రిటన్ దేశములో వేల్స్ అనే కొండ ప్రాంతం ఉన్నది. అది బ్రిటన్ రాజధానియైన లండన్ నగరానికి దాదాపుగా 300 కి.మీ. దూరంలో ఉన్న మారుమూల ప్రాంతం. ఆ ఊరిలో మేరీజోన్స్ అనే పాప ఉండేది. మేరీజోన్స్ తల్లి దండ్రులు బట్టలునేసే వారు. తల్లిదండ్రులు దేవునియందు భయభక్తులు కలిగిన వారు కావడంతో మేరిని కూడ చిన్న తనం నుండే దేవుని గురించి చెప్తూ పెంచింది తల్లి. ఆ విధంగా చిన్నతనం నుండే దేవుని గురించి వింటూ పెరిగిన మేరి దేవుని గురించి తెలుసుకొనుటకు ఎంతో ఆసక్తి చూపేది.

మేరి ప్రతి ఆదివారం తన తల్లిదండ్రులతో కలసి 2 మైళ్ళు నడిచి చర్చికి వెళ్ళేది. చర్చిలో పాస్టర్‌గారు చెప్పిన వాక్యాన్ని శ్రద్ధగా విని తనకు అర్థమైన విషయాలను వారాంతం గుర్తు చేసుకుంటూ ఉండేది. ఎందుకంటే మేరి వద్ద బైబిల్ లేదు. ఇప్పుడు మనకు దొరుకుతున్నంత విరివిగా అప్పుడు బైబిల్స్ అందరి దగ్గర ఉండేవి కాదు. బైబిల్స్ ముద్రించడం ఎంతో ఖర్చుతో కూడుకున్నది కావడంతో బైబిల్ చాలా ఖరీదైనదిగా అరుదైనదిగా ఉండేది. కేవలం ధనవంతులు మాత్రమే బైబిల్‌ను కొనగలిగేవారు.

సంపన్నురాలైన ఇవాన్స్ ఒక రోజు మేరి వాళ్ళింటికి వచ్చి మేరి తల్లితో మాట్లాడుతూ తాను ఒక బైబిల్‌ను కొన్నదని చెప్పింది. ఆ మాట విన్న మేరి ఎంతో సంతోషం తో ఇవాన్స్ దగ్గరకు వెళ్ళి 'మీరు సొంత బైబిల్‌ను కలిగి ఉన్నారా, నేను ఆ బైబిల్‌ను చూడవచ్చా?' అన్నది ఉత్సాహంగా. అందుకు ఇవాన్స్ నీవు ఆ బైబిల్‌ను చూడవచ్చు కానీ నీకు చదవడం వస్తేనే కదా బైబిల్‌ను చదవగలవు అన్నది. ఆ మాటకు మేరి ఎంతో నిరుత్సాహ పడిపోయింది. అది గమనించిన ఇవాన్స్ మేరితో అధైర్యపడకు చదవడం నేర్చుకో గానే మా ఇంటికి వచ్చి నా బైబిల్ చదవవచ్చు అని చెప్పి వెళ్ళిపోయింది. అప్పటికి మేరి వయస్సు 8 సం॥లు. ఆ ఊర్లో స్కూల్ లేని కారణాన మేరి అప్పటి వరకు స్కూల్‌కి వెళ్ళలేదు.

మేరికి చదవడం రాకపోయినప్పటికి, తన ఊర్లో స్కూల్ లేకపోయినప్పటికి బైబిల్ చదవాలనే ఆశ మాత్రం పోలేదు. మేరి దేవుని సహాయం కొరకు అనుదినము ప్రార్థిస్తూ ఉండేది. కొంతకాలానికి వేల్స్‌కి రెండు మైళ్ళ దూరంలో ఒక స్కూల్ ఏర్పాటు చేయబడింది. మేరి ఆనందానికి హద్దులు లేవు. ఎంతో సంతోషంతో రెండు మైళ్ళు నడిచి స్కూల్‌కి వెళ్ళేది. స్కూల్లో చెప్పే అన్ని విషయాలు శ్రద్ధగా నేర్చుకునేది. 2 సం॥లలో చదవడం నేర్చుకున్నది మేరి. ఒక ఆదివారం చర్చి అయిపోయిన తరువాత మేరి ఇవాన్స్ గారితో–ఇవాన్స్ ఆంటీ, ఇప్పుడు నేను చదవడం నేర్చుకున్నాను మరి మీ బైబిల్‌ను చదవడానికి మీ ఇంటికి రావచ్చా? అన్నది. మేరి ఆసక్తిని గమనించిన ఇవాన్స్‌గారు నవ్వుతూ "తప్పకుండా" అన్నారు.

మరునాడు స్కూల్ నుండి రాగానే తల్లిదండ్రులకు చెప్పి ఇవాన్స్ గారింటికి వెళ్ళి బైబిల్‌ను చదవడం ప్రారంభించింది మేరి. బైబిల్ చదవడం ద్వారా దేవున్ని తెలుసుకొనుటను ఎంతో ఆనందించేది. ఇవాన్స్ గారింటికి వెళ్ళి బైబిల్ చదవడం మేరి దైనందిన కార్యక్రమముగా మారింది. ఒక రోజు మేరి ఇంటికి చాలా ఆలస్యంగా వచ్చింది. ఆలస్యానికి కారణం అడిగింది తల్లి. ఇవాన్స్‌గారి బైబిల్లో కొంత భాగాన్ని నాతో తెచ్చుకొనుటకు ఇంత సమయం పట్టింది అని జవాబిచ్చింది మేరి. ఆశ్చర్యంతోను అనుమానంతోను కూతురు వైపు చూసింది తల్లి. అందుకు మేరి కంగారు పడకు, మత్తయిసువార్త 6వ అధ్యాయాన్ని చదువుతూ కంఠత పెట్టేసరికి ఆలస్యం అయ్యింది అని చెప్పి తను నేర్చుకున్న దానిని తండ్రికి అప్పజెప్పింది. దేవుని వాక్యంపట్ల మేరికున్న ఆసక్తిని బట్టి తల్లిదండ్రులు దేవుని స్తుతించారు. అప్పుడు మేరి మనకే ఒక సొంత బైబిల్ ఉంటే ఎంత బాగుంటుంది కదా అన్నది. నిజమే కానీ, బైబిల్ చాలా ఖరీదైనది దానిని కొనుటకు మన ఆర్థికస్థితి సరిపోదు అన్నాడు తండ్రి. కానీ

మేరికి తనకంటూ ఒక బైబిల్ ఉండాలనే కోరిక బలంగా కలగసాగింది. దాంతో ఆమె బైబిల్ కొనుటకు డబ్బును దాచిపెట్టడం ప్రారంభించింది.

మేరి ఇంట్లో కోళ్ళను పెంచేది. వాటి గ్రుడ్లను సంతలో అమ్మి ఆ డబ్బును దాచిపెట్టేది. అంతేకాక తనకు చేతనైన నేతపని చేసి చిన్నచిన్న వస్త్రాలను అమ్మి డబ్బు దాచేది. వారంతపు రోజుల్లో చిన్నపిల్లలను చూచుకొను బేబిసిట్టర్ వంటి పనులు చేస్తు డబ్బు సంపాదించి వాటిని దాచేది. కొంత తల్లిదండ్రుల సహాయంతో మొత్తానికి ఆరు సం॥లకు బైబిల్ కొనుటకు కావలసిన ధనాన్ని కూడబెట్టింది. ఆ డబ్బుతో చర్చి పాస్టర్‌గారి వద్దకు వెళ్ళి బైబిల్ కావాలని అడిగింది. పాస్టర్‌గారు తన వద్ద బైబిల్స్ లేవని, బాలా అనే ఊర్లో ఉండే థామస్‌గారి వద్ద బైబిల్స్ ఉంటాయి, కానీ ఈ సమయానికి ఆయన దగ్గర కూడ బైబిల్స్ ఉండక పోవచ్చు, ఎందుకంటే సంవత్సరానికి ఒక్కసారే ఆయన బైబిల్స్ తెప్పిస్తుంటారు అని జవాబు ఇచ్చాడు. మేరి వెంటనే తల్లిదండ్రుల అనుమతితో బాలా అనే ఊరికి ప్రయాణమైంది.

బాలా అనే ఊరు వేల్స్ నుండి 25మైళ్ళ దూరంలో ఉన్నది. దూరమైనను తనకూ ఒక సొంత బైబిల్ ఉండాలనే పట్టుదలతో చెప్పులు కూడ లేకుండా కొండ మార్గాన కాలినడకన ప్రయాణం సాగించి ఇంచుమించు రోజు ప్రయాణం తరువాత బాలా ఊరు చేరింది మేరి. పాస్టర్‌గారికి తెలిసిన వారి ఇంట బస చేసి మరునాడు థామస్ గారిని కలిసి తనకు ఒక బైబిల్ కావాలని అడిగింది. అయితే థామస్ గారు తన వద్ద బైబిల్స్ లేవని చెప్పడంతో మేరి తను ఆరేళ్ళుగా పడిన శ్రమ అంతా వృథా అయినందుకు ఎక్కి ఎక్కి ఏడ్వసాగింది. బైబిల్ కొరకు మేరి ఆసక్తిని గ్రహించిన థామస్‌గారు తన బైబిల్‌ను మేరికి ఇస్తూ, వాక్యమును శ్రద్ధగా పఠించి, ధ్యానించమని చెప్పారు. తన సొంత బైబిల్‌ను పొందిన మేరిజోన్స్ ఆనందానికి హద్దులు లేవు. ఎంతో సంతోషంతో ఇంటికి చేరుకున్నది.

మేరీజోన్స్‌కు బైబిల్‌ను ఇచ్చిన థామస్‌గారు దేవుని వాక్యము పొందు నిమిత్తం మేరి కనుపరిచిన ఆసక్తి, దాని కొరకు ఆమె పడిన శ్రమను గురించి ఆలోచించి, బైబిల్ అందరికి అందుబాటులో ఉండేంత తక్కువ ధరకు లభ్యం కావాలని ఆలోచిచంచి "బైబిల్ సొసైటి"ని స్థాపించటం జరిగింది. నేడు దాదాపు 245 దేశాల్లోను బైబిల్ సొసైటీలు స్థాపించబడ్డాయి. మీ బైబిల్ మొదటి పేజిలో బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా అని ముద్రించబడి ఉంటుంది.

చూశారా పిల్లలూ, మేరీజోన్స్‌కు దేవుని వాక్యంపై వీన్న ఆసక్తి వలననే ఈ రోజు మనందరం దేవుని వాక్యాన్ని చాలా సులభంగా, విరివిగా పొందగలుగుతున్నాం. అయితే నీవు దేవునిపట్ల, దేవుని వాక్యం పట్ల ఆసక్తి కలిగి ఉన్నావా? రోజు దేవుని వాక్యాన్ని పఠిస్తున్నావా? ధ్యానిస్తున్నావా?

మేరీజోన్స్ ఎంతో కష్టమైన పరిస్థితులలో ఉన్నప్పటికి దేవుని వాక్యమును తెలుసుకోవలనే ఆసక్తి కొలది ఆమె 25 మైళ్ళు చెప్పులు లేకుండా నడిచింది. అంత దూరం నడవడం ఎంతో కష్టమైనప్పటికి దేవుని కొరకు కష్టపడుటకు ఇష్టపడింది. తన వయస్సు పిల్లలందరూ ఆడుకుంటూ రకరకాల పనులలో ఉన్నప్పుడు తాను ఎంతో కష్టపడి పనులు చేసుకుంటూ బైబిల్‌ను పొందుటకు డబ్బును దాచి పెట్టింది. నీవు దేవుని పని కొరకు నీ పాకెట్ మనీని విని యోగిస్తున్నావా లేక సండేస్కూల్‌లో వేయవలసిన కానుకను కూడా తిను బండారాలు కొనుటకు వాడుతున్నావా? లండన్‌లో మారు మూల ప్రాంతంలో నివసించిన మేరీజోన్స్ గురించి ఈ రోజు ప్రపంచమంతా తెలుసుకుంటుంది.

మేరీజోన్స్‌వలె మనము కూడా దేవుని కొరకు జీవించి దేవుని నామానికి ఘనతను తీసుకురావాలి.

**యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన నామమును ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియచేయుడి. కీర్తనలు 105:1**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యము ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడల వాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# కృపాదానం

హైస్కూలు విద్య ముగించగానే తెలంగాణాలోని పెద్దపల్లి గ్రామంలో సేవకులుగా పనిచేస్తున్న బంధువులకు సేవలో సహకారిగా ఉన్నాడు కృపాదానం. కాని అది జీవనోపాధికైన సేవ మాత్రమే.

తన 23వ ఏట మేనత్త కుమార్తె హన్నమ్మతో వివాహం జరిగింది. 1936 వరకు తెలంగాణా పెద్దపల్లిలోని భువన గిరిలో ఉన్న బైబిల్ మిషన్‌లో సేవకునిగా పనిచేశారు. భార్య హన్నమ్మకు రెండవ కాన్పులో ఇద్దరు ఆడ కవల పిల్లలు కలిగారు. అప్పటికి కృపాదానం హన్నమ్మలకు ముగ్గురు ఆడ సంతానం. పెద్దకుమార్తె రత్నకుమారి, ఇద్దరు కవల పిల్లలు మార్తమ్మ మరియమ్మ పుట్టారు. కృపాదానంకు చాలా వేదన కలిగింది. ఒక మగపిల్లవాడైనా లేకపోతే ఎలా? మరలా ప్రార్ధనకు హేతువు దొరికింది. ప్రభువా! ఒక్క మగ పిల్లవాడిని ఇవ్వు అని ప్రార్థించసాగాడు. మగపిల్ల వాడినిస్తే సమూయేలు అని పేరు పెట్టి నీ సేవకు ఇస్తాను అని ప్రార్థించటం ప్రారంభించింది భార్య హన్నమ్మ .

తెలంగాణ నుండి ఒంగోలుకు వచ్చి తన అక్క బావ గారల ప్రైవేటు స్కూలులో కొంతకాలం టీచరుగా పని చేశారు. 1940లో మగపిల్లవాడు సామ్యేల్ రాజేంద్ర, 1942లో రెండవ కుమారుడు జోసఫ్ జన్మించారు.

1942లో రెండవ ప్రపంచయుద్ధ సమయంలో ఇండియన్ ఆర్మీ నుండి పిలుపు వచ్చింది. మహారాష్ట్రలోని దేవలాలి ఆర్మీ క్యాంపు ప్రయాణానికి సిద్ధపడుతున్నారు కృపాదానం. ఆ రోజు ఏప్రిల్ 17, ఒంగోలులో ఆ రోజు బయలుదేరితే కాని సమయానికి దేవలాలి చేరాడు. భార్య హన్నమ్మ ఆ రాత్రి ప్రసవిస్తుంది అని డాక్టరమ్మ చెప్పింది. రాత్రి వరకు సామాను సర్దుకొని కూర్చున్నాడు. రాత్రి పది గంటలకు రెండవ కుమారుడు జోసఫ్ పుట్టాడు. భార్య బిడ్డలను రేపల్లెలో అత్తగారింటిలో వదిలిపెట్టాడు. ఇంటికి దగ్గరలోనే రైల్వేస్టేషన్ కావడంతో గబగబ స్టేషన్‌కు వెళ్ళి రైలు ఎక్కాడు.

1942లో యుద్ధం ముమ్మరంగా జరుగుతుంది. 1943లో ఇంటికి వెళ్ళటానికి రెండు నెలలు సెలవు మంజూరు అయినది. రేపల్లెకి ఉత్తరం వ్రాశాడు ఇంటికి వస్తున్నట్లుగా.

రేపల్లెలో ఇంటివద్ద భార్య, ఇక్కడ దేవలాలిలో కృపాదానం సెలవు మంజూరుకు బహుగా ప్రార్థించారు. సెలవు మంజూరు కావడంతో ప్రభువు ప్రార్థన విన్నాడని బహు సంతోషించారు. ఆరు సంవత్సరాల వయస్సున్న పెద్ద కుమార్తె తండ్రిని విడిచి ఇంతకాలం ఎప్పుడు లేదు. ఇప్పుడు తండ్రిరాకకై ఎదురు చూస్తున్నది. అంతలో కృపాదానం గారి సెలవు ఆపివేయబడింది అని టెలిగ్రాం వచ్చింది.

కృపాదానంతో పాటు మొత్తం ఇరవైమందికి సెలవు మంజూరయింది. కాని కృపాదానం ఒక్కడినే ఆపివేశారు. అసలు సెలవు ఇవ్వకపోయినా బాగుండును. సెలవు ఇచ్చి ప్రయాణానికి సిద్ధపడిన తర్వాత ఆగిపోవటం చాలా నిరాశను కలిగించింది. ప్రభువా ఎందుకు ఇలా చేశావు? అని ప్రార్థించాడు. ఉదయాన్నే దేవలాలిలో ఉన్న చాప్లిన్ (పాస్టర్) దగ్గరకు వెళ్ళాడు. జరిగిన సంగతి చెప్పి ఇంటి వద్ద పిల్లలు నేను రాకపోతే ఏడుస్తారు. మీరు ఆఫీసర్‌తో చెప్పి సెలవు ఇప్పించండి అన్నాడు. ఆ పాస్టరు మళయాళీ. నాయనా! దేవుని చిత్తం అయితేనే కాని నీ సెలవు రద్దు చేయబడదు. నీవు దేవుని మీద ఆధారపడిన వాడివని అనిపిస్తుంది. ఆయన చిత్తానికి లోబడు నీకు మంచి జరుగుతుంది. నేను నీ తరపున ఆఫీసరుతో మాట్లాడలేక కాదు గానీ నాకెందుకో నడిపింపు కలగటం లేదు అని ప్రార్థించి పంపివేశారు.

రెండు నెలల తర్వాత మిగిలిన వారంత సెలవుల నుండి తిరిగి వచ్చారు. కృపాదానంకు రెండు నెలల సెలవు మంజూరైంది. మొత్తానికి ఇంటికి చేరాడు. సెలవుల నుండి వచ్చిన ఇరవైమందిని యుద్ధంలో మొదటిస్థానంలో ఉండేం

దుకు యుద్ధంలోకి పంపించారు. వారిలో ఒక్కరైనా తిరిగి రాలేదు. తన సెలవు ఆపివేయడంలో దేవుని ప్రణాళికను, ప్రేమను అనుభవించిన కృపాదానం అప్పటి నుండి తన జీవితంలో ఏమి జరిగిన అది దేవుని చిత్తమని గ్రహించాడు. తన పై అధికారులు ఏమి చేస్తారో అదంతా దేవుని ప్రణాళిక ప్రకారం జరుగుతుందని, దేవుని చిత్తం లేకుండా దేవుని బిడ్డలకు ఏ ఉద్యోగ బదిలీ రాదు అని నమ్మాడు.

దేవుని చిత్తమును గురించి నా స్వీయ అనుభవము ఒకటి చెప్పాలి. 1961లో నేను, నా ప్రియ స్నేహితుడు సుబ్బారెడ్డి ఒకే ఏడాది బి.ఎ. పాసయ్యాము. అప్పటికి సుబ్బారెడ్డి ఇండియన్ ఎయిర్‌ఫోర్సులో సెలెక్ట్ అయి చెన్నైలో ట్రైనింగ్ పొందుతున్నాడు. డిశెంబరు 9న విశాఖ ఆంధ్ర యూనివర్సిటీలో కాన్వొకేషన్ జరుగుతుంది. ట్రైనింగ్‌లో ఉన్నందున కాన్వొకేషన్ అటెండు అవటానికి నాలుగు రోజులు సెలవు ఇవ్వలేదు. అప్పుడే సుబ్బారెడ్డి క్రొత్తగా ప్రభువును నమ్ముకొని బాప్తిస్మము తీసుకున్నాడు. ఎంత ప్రార్థించినా దేవుడు సెలవు ఇప్పించలేదు. మరు సంవత్సరం అంతవరకు సెలవు వాడుకొనని వారిని బదిలీలు చేస్తు హకింపేటకు బదిలీచేశారు. సరిగ్గా ఆ సమయంలోనే నేను హైదరాబాద్ చంచల్‌గూడలోని గవర్నమెంటు ప్రింటింగ్ ప్రెస్‌లో పే బిల్లు క్లర్క్‌గా పని చేస్తున్నాను. ఆ తరువాత 2 సం॥లు మా స్నేహ మాధుర్యం కొనసాగింది. విశాఖ కాన్వొకేషన్‌కు దేవుడు సెలవు ఇప్పించినట్లయితే ఇప్పుడు ఈ ట్రాన్స్‌ఫర్ జరిగి మేమిద్దరం కలిసి మరలా 2 సంవత్స రాలు కలిసి ఉండే అవకాశం దొరికేది కాదు. కాబట్టి ప్రభువును నమ్మినవారి జీవితంలో ఏ మార్పు వచ్చినా అది దేవుని చిత్తమని గ్రహించి దానిని స్వీకరించాలి. **( సశేషం)**

**చందాదారుల వివరములు**

1. ప్రసాద్‌రావు గారు ( హైదరాబాద్) మొదటి నుండి కిరణ్ అనే పేరున పత్రికను పోషిస్తున్నారు.
2. డా॥ వినయ్‌కుమార్ (ఇ.యన్.టి అపోలో) – 5000 (ప్రతి సం॥ము)
3. డా॥. బి. ఉషా సతీష్ గారు (నెల్లూరు) – 2000 (ప్రతి సం॥ము)
4. దానం. మెర్సీ ఇశ్రాయేల్ గారు (నెల్లూరు) – 1000 (ప్రతి సం॥ము)
5. అపొ. ఎబినేజర్ గారు (హైదరాబాద్) – 1500 (ప్రతి నెల)
6. దాసరి పాల్ – 3000 (ప్రతి నెల)
7. గంధం. డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000 (ప్రతి నెల)
8. ముద్ద. సామ్యేల్ విల్సన్ – 500 (ప్రతి నెల)
9. జి. స్టాలిన్ (కావలి)
10. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
11. సుమతి చక్రవర్తి
12. దాసరి. మాధవరావు

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**

**A/c No. 10957294340**

**21వ పేజీ తరువాయి...**

తప్పక మీ అవసరతలు తీరుస్తాడు (లూకా 12:22–32)

క్రమశిక్షణలో ఖర్చులు పరిమితం చేసుకోవాలి. హెబ్రీ. 13:5ను తప్పక పాటించండి. ధనాపేక్షలేనివారై కలిగిన దానిలో తృప్తి పొంది ఉండాలి. ధనాపేక్ష విగ్రహారాధనే. మన అక్కరలు దేవుడు తీరుస్తాడు. డబ్బులు కోసం గడ్డితినే వారు డబ్బును గడ్డిగా చూడాలి. చెప్పడం సులభమే. ఆచరణలో పెట్టడం కష్టసాధ్యం అనుకుంటున్నారు కదూ! నిజమే, మనకు సాధ్యం కాకపోవచ్చు. కాని దేవునితో సమస్తము సాధ్యమే (మార్కు 14:38). గతంలో దేవుని ప్రజలు కష్టాల నెదుర్కొన్నప్పుడు దేవుని వైపే చూచి సహాయం పొందారే గాని మరి ఏ ఇతర ప్రాపంచిక శక్తివైపు మొగ్గు చూపలేదు. అంతేగాని సాతానుకు దాసోహం కారాదు.

కనుక ప్రియ పాఠకులారా! మీరు ఏం చేస్తున్నారు? లంచం ముట్టనివారైతే ప్రభువుకు ఘనత తెచ్చిన వారౌతారు. లేకుంటే ఈ రోజు నుండి 'లంచం' ముట్టనని గట్టి నిర్ణయం తీసుకోండి. అంతేకాదు ఆ నిర్ణయానికి బద్ధుడవైయుండి బలపడాలంటే బైబిలును క్రమంగా చదివితే అది మిమ్ములను మంచిమార్గంలో నడిపించడానికి సహాయపడుతుంది. మెలకువగా ఉండి ప్రార్థన చేయండి. దేవుడు మీకు అన్ని విధాల సహాయం చేయునుగాక! ఆమెన్.

# ధైర్యముగా ఉండుము

ఈ లోకంలో జీవించడానికి మనకు చాలా ధైర్యం కావాలి. మనం ఈ లోకంలో జీవించే 70 లేదా 80 సంవత్స రాల కాలములో భయంతో జీవించే సంవత్సరాలే ఎక్కువగా ఉంటాయి. చాలా విషయాలు మనలను నిత్యము భయపెడు తుంటాయి. ఈ జీవన సంబంధమైన విషయాలలోనే మనం ఎక్కువగా భయపడుతుంటాము. ముఖ్యంగా 'ఎలా బ్రతకాలి?' అనే విషయం మనల్ని భయపెడుతుంది. మనల్ని దేవుని నుండి దూరం చేయడానికి సాతాను దగ్గర ఉన్న పెద్ద ఆయుధం భయపెట్టడం. ఈ లోకంలో మనం బ్రతకాలంటే డబ్బు కావాలి, డబ్బు లేకపోతే నీవేమీ చేయలేవని నిత్యం మన మనస్సులో భయం రేకెత్తిస్తుంది. అయితే దేవున్ని నమ్మిన వారు మాత్రం ఎల్లప్పుడు ధైర్యంగానే ఉంటారు. వారిలో ఒక విధమైన తెగింపు వస్తుంది. దేనిని, ఎవరినీ లెక్క చెయ్యరు. చివరకు చావుకు కూడా తెగిస్తారు. దానియేలు గ్రంథంలో మనం చూస్తే షద్రకు, మేషాకు, అబేద్నెగో అను యౌవనస్తులు దేవునికి వ్యతిరేకమైన రాజు యొక్క ఆజ్ఞను పాటించడాన్ని ఎలా తిరస్కరించారో తెలుస్తుంది. అగ్ని గుండాన్ని సైతం వారు లెక్క చెయ్యలేదు. దేవుని కోసం వారి ప్రాణాలను తృణీకరించుకున్నారు. దేవుని కోసం నిలబడటం కన్నా వారు జీవించటం ముఖ్యం కాదనుకుని వారి ప్రాణాలను ఇవ్వడానికి సిద్ధపడ్డారు. వారి యొక్క ధైర్యం రాజుని సైతం అబ్బురపరచింది. ఆ దేశమంతటా యెహోవా యొక్క నామము ఘనపరచబడటానికి కారణమయ్యింది. వారు యెహోవాయందు భయభక్తులు కలిగి ఉన్నారు కాబట్టి వారు అంత ధైర్యము చూపించగలిగారు. *'యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట బహుధైర్యము పుట్టించును' (సామెతలు 14:26)*. ఈ లోకంలో జీవించేటప్పుడు మనం కూడా ధైర్యము కలిగి ఉండాలంటే దేవునియందు భయ భక్తులు కలిగి జీవించాలి. దేవున్నిబట్టి ఈ లోకంలో మనం ధైర్యంగా జీవించే జీవితం అన్యుల ఎదుట దేవుని నామము ఘనపరచబడటానికి కారణం కావాలి. *'నిబ్బరము గలిగి ధైర్యముగా నుండుము, దిగులుపడకుము, జడియకుము, నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును' (యెహోషువ 1:9)* అని యెహోషువతో చెప్పిన దేవుడు మనతో కూడా అదే చెప్తున్నాడు. కాబట్టి ఎప్పుడూ ధైర్యంగా ఉండాలి. మనం దేవునియందు భయ భక్తులతో ఉండి ఏ విషయములోను భయపడకుండా దేవుడు మనకు తోడై ఉన్నాడని ధైర్యంతో ముందుకు సాగుదాం.

**పరిశుద్ధ గ్రంథ పరిశోధన పట్టిక-2 జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 అ | 2 బే | ద్నె | 3 గో | | 4 బే | త్లె | 5 హే | 6 ము |
| బ్బా | త | | 7 మె | లి | తే | | 8 ము | ల్లు |
| | ని | 9 త | రు | | 10 లు | 11 ది | య | |
| 12 లే | య | లీ | | 13 బా | | టి | | 14 నీ |
| 15 మి | ద | త | లు | అ | ద | వి | తే | నె |
| | | కు | | నా | | | | ని |
| | 16 యె | మీ | 17 మా | | 18 హి | స్సో | 19 పు | |
| 20 యో | బు | | 21 ది | దు | మ | | 22 దీ | 23 వి |
| 24 నా | కా | ప | రి | | 25 ము | ద | నా | ని |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక -2**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. యం. కృపావాణి, నల్గొండ
2. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
3. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
4. టి. సుదర్శన్, నంద్యాల
5. వై. జడ్సన్, బెంగుళూరు
6. యస్. నీలవేణి, విజయవాడ
7. బి. పీటర్, హైదరాబాద్
8. ఆర్. దయామణి, రాజమండ్రి

# లంచం

లంచం..... లంచం....లంచం.... ఆఫీసుల్లో, సంస్థల్లో, ఇంట్లో ఎక్కడ ఏ పని త్వరితంగా కావాలన్నా లంచంతో పని సులభతరమౌతుంది. లంచమివ్వకుంటే పనికాదు. ఈ లంచంమివ్వడమనేది అనాది నుండి వస్తూనే ఉంది. అవతలి వ్యక్తికి ధన/వస్తు రూపేణా బహుమతిగా ఇచ్చి వారిని లొంగదీసుకుని, తమ పనులను సులభంగా సకాలంలో సాధించుకొనుట, దీనిని లంచం అంటాం గదా!

లంచం తీసుకోని వారైనా, కొన్ని సమయాల్లో తమ పనులు సాధించుకోవడానికి 'లంచం' ఇవ్వాల్సివస్తుంది. లంచం తీసుకోవడమనేది అవినీతి. కొందరి అభిప్రాయ మేమిటంటే, లంచం అనేది ఎదుటి వారిని పీడించి తీసు కుంటేనే తప్పవుతుంది కాని వారంతట వారే సంతోషంగా ఇస్తుంటే అది లంచమెలా అవుతుంది? అని చక్కగా తమను తాము సమర్థించుకుంటూ ఇదే అభిప్రాయాన్ని ఇతరులకు కూడా చెప్పి వారిని కూడా లంచం తీసుకోవడానికి ప్రోత్సహి స్తుంటారు. ప్రభుత్వం గాని, సంస్థలుగాని ఎన్ని చెప్పినా, ఎన్ని నినాదాలిచ్చినా ఈ లంచగొండితనాన్ని ఎవరూ రూపుమాప లేదు. ప్రతి మనిషిలో నైతికంగా మార్పు వస్తే తప్ప ఈ జాడ్యం సమాజాన్ని వీడిపోదు. ఇది క్రిందిస్థాయి నుండి ఉన్నత ఉద్యోగుల వరకూ ఉన్న రోగమే.

ఇది ఎలా ఉందంటే ఏదైనా ప్రోగ్రాం కాని, డ్రామాలు కాని ప్రారంభం కాలేదు కాబట్టి ప్రారంభించాక వెళ్ళొచ్చులే అని జనం, జనం ఇంకా రాలేదు కాబట్టి వచ్చాక ప్రారంభిం చొచ్చని నిర్వాహకులు అనుకుంటే ఇక ఆ కార్యక్రమము సజావుగా సాగినట్టే. అలాగే లంచం ఇవ్వకపోతే పనులు కావేమోనని ప్రజలు, ప్రజలు వారేంతట వారే ఇస్తుంటే తీసుకోవడానికి మనకేమని ఉద్యోగలు/పాలకులు. ఈ విధంగా ఎవరికి వారు అనుకోవడం మూలాన ఇది నిరం తరంగా ఇలా సాగిపోతూనే ఉంది. ఈ విధమైన లంచం అనేది ప్రస్తుత ప్రపంచంలో నాలుగు కాళ్ళతో నడుస్తుంది.

లంచం ఇవ్వడం/ తీసుకోవడం రెండూ భారతీయ శిక్షా స్మృతి ప్రకారం నేరమౌతుంది. కొంతమంది దేవునికే లంచంమివ్వ జూస్తుంటారు. 'నీవు మాకు ఫలానా ఫలానా పని చేస్తే మేము నీకు ఫలానిది సమర్పించుకుంటాం' అని. కాని దేవుడు మనిషి నుండి కోరేది హృదయమే. నీవు చెడి పోవడం, సాతానుకు లొంగిపోవడం ఆయనకు ఏ మాత్రం ఇష్టంలేదు. నీ హృదయం సాతానుకు నిలయంగా మారడం, నీవు నరకానికి వెళ్ళడం ఆయన ఇష్టపడడు. ఎందుకంటే ఆయన నీ సృష్టికర్త, నిన్ను ప్రేమించేవాడు కాబట్టి.

లంచం తీసుకోవడం అనేది మనిషిని నైతికంగా దిగ జారుస్తుంది. నీ మనస్సాక్షిని మలినపరుస్తుంది. నీతిమంతు లను అవినీతి పరులుగా చేస్తుంది. పట్టుబడితే ఆ మనిషిని జైలు వరకూ తీసుకెళ్తుంది. 'లంచము' గురించి బైబిలు ఏమి చెప్తున్నదో తెలుసుకుందాం!

"లంచము తీసుకొనకూడదు, లంచము దృష్టిగలవానికి గ్రుడ్డితనము కలుగజేసి నీతిమంతుల మాటలకు అపార్థము చేయించును" నిర్గమకాండం 23:8

'లంచమునసహ్యించుకొనవాడు బ్రదుకును' సామె. 15:27. 'న్యాయవిధులను చెరుపుటకై దుష్టుడు ఒడిలో నుండి లంచము పుచ్చుకొనును' సామె. 17:23 'లంచములు పుచ్చు కొను వాడు దేశమును పాడుచేయును' సామె. 29:4

కాబట్టి ప్రియ చదువరీ! మీ ఆప్తులెవరైనా మిమ్ములను ప్రోత్సహిస్తే దానిని ఖండించండి. నిర్మొహమాటంగా లంచం తీసుకోవడం తప్పు అని చెప్పండి. మీకు ఉన్నదానిలోనే సంతృప్తి పొందటం అలవరచుకోండి. అలా కాక అప్పులు చేసి అవి తీర్చలేక లంచం తీసుకోవటం అలవాటు చేసుకో వద్దు. లంచమును గురించి బైబిలు ఏమి చెప్తుందో మనం తెలుసుకున్నాం.

మీ ఇంట్లో ఆర్థిక ఇబ్బందులుండవచ్చు. ఆర్థిక ఇబ్బందులు లేనివారు కూడా లంచాలు తీసుకునే వారు న్నారు. మీరు దేవునికి భయపడండి. ఎవరూ చూడక పోయినా దేవుడు చూస్తున్నాడని గుర్తుంచుకోండి. మీ అవసరతల గురించి దేవుని దగ్గర మొఱ్ఱపెట్టండి. ఆయన

**...మిగతా 19వ పేజీలో**

# లోకంతీరు 5

(పుట్టుక చావు మధ్య సంబరం)

**"మనుష్యుడు ఏపాటివాడు? అతని ఘనపరచనేల? అతని మీద నీవు మనస్సు నిలుపనేల?" యోబు 7:17**

ప్రతిరోజూ బైబిల్ చదివినా, ప్రార్ధన చేసుకున్నా, ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా చర్చికి వెళ్లి వాక్యం విన్నా మనుష్యులు దేవుణ్ని ఎందుకు నమ్మలేకపోతున్నారు? దేవుణ్ని నమ్మకుండా ఇవన్నీ చేయడం వల్ల దేవుడు సంతోషిస్తాడని ఎలా అనుకుంటారు? ఎందుకు జీవితాన్ని బరువుగా, భారంగా ఈడ్చుకుంటూ వెళ్తారు? ఏం సాధిస్తారు? దేవుడు పెట్టిన నియమ నిబంధనల్ని దిక్కరించి ఏం సాధిస్తారు? ప్రపంచమంతాపోయేదారిలోనే పోవాలను కోవటం డబ్బు ద్వారా, చదువు ద్వారా, ఉద్యోగం ద్వారా, వ్యాపారం ద్వారా, పదవుల ద్వారా, ప్రజల ముందు గొప్ప పేరు సంపాదించుకోవాలనుకోవటం, దానికోసం అష్టకష్టాలు పడటం, శారీరక శ్రమ, మానసిక ఒత్తిడి, అనుకున్నది జరగనప్పుడు జీవితం మీద విరక్తి కలగటం ఇదంతా దేవుని ఆశీర్వాదం వలన వస్తుందా? యెహోవానుబట్టి సంతోషించుము ఆయన నీ హృదయ వాంఛలను తీర్చును. నీ మార్గమును యెహోవాకు అప్పగింపుము నీవు ఆయనను నమ్ముకొనుము ఆయన నీ కార్యము నెరవేర్చును. కీర్తనలు 37:4,5; యెహోవా యెదుట మౌనముగా నుండి ఆయన కొరకు కనిపెట్టుకొనుము. తన మార్గమున వర్ధిల్లువాని చూచి వ్యసనపడకుము. కీర్తనలు 37:7; యెహోవా కొరకు కనిపెట్టుకొనియుండుము, ఆయన మార్గము ననుసరించుము, భూమిని స్వతంత్రించు కొనునట్లు ఆయన నిన్ను హెచ్చించును. 37:34 అని బైబిలు చెప్పే దాన్ని ఎందుకు సీరియస్‌గా తీసుకోవడంలేదు.

> **పుట్టుక**
>
> **దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

అలా సీరియస్‌గా తీసుకోనప్పుడు, బైబిల్ చదవటం, చర్చికి వెళ్ళి వాక్యం వినడం అంతా నాటకం కాదా? అలా నటించటం కన్నా అన్యజనుల్లా జీవించటం ఎంతో ఉత్తమం. క్రైస్తవులుగా ఉంటూ దేవుణ్ని హృదయ పూర్వకంగా నమ్మకపోవడం వల్ల దేవుడు బాధపడడా? దేవుణ్ణి బాధపెట్టి మరలా తమ అవసరాలకి దేవుని దగ్గరకు వెళ్ళడం సమంజసమా? ఎవర్ని సంతోషపెట్టడానికి ఇదంతా? కుటుంబాన్నా? సమాజాన్నా? రేపు మన జీవితానికి ఎలాంటి గ్యారంటీ లేదు. మన శరీరంలో ప్రాణం ఉన్నంత వరకే కదా మన వైభవం. (మనుష్యులు వట్టి నీడవంటివారై తిరుగులాడుదురు. వారు తొందరపడుట గాలికే గదా. వారు ధనము కూర్చుకొందురు గాని అది ఎవనికి చేజిక్కునో వారికి తెలియదు. కీర్తనలు 39:6) ఈ ప్రపంచంలో దేవుణ్ని నమ్మని వారంతా ఏదో బతకాలి కాబట్టి బతుకుతున్నారు, చావలేక బ్రతుకుతున్నారు. దేవుణ్ని హృదయపూర్వకంగా నమ్మిన వారికి అస్సలు కష్టాలే ఉండవు. ఎందుకంటే వారి ప్రతి కష్టాన్ని దేవునికి అప్పచెప్తారు కాబట్టి. (నీ భారము యెహోవా మీద మోపుము ఆయనే నిన్ను ఆదుకొనును. నీతిమంతులను ఆయన ఎన్నడును కదలనీయడు. కీర్తనలు 55:22) దేవుణ్ని నమ్మని వారు ప్రత్యామ్నాయంగా లోకం మీద, మనుష్యుల మీద ఆధారపడాలి. అలా ఆధారపడే వాళ్ళకి ఏ మాత్రం మనఃశ్శాంతి ఉండదు. ఎప్పుడూ టెన్షన్స్‌తో చస్తుంటారు. దేవుణ్ని నమ్మిన వాళ్ళకి ఎలాంటి టెన్షన్స్ ఉండవు. ఎందుకంటే వాళ్ళ జీవితంలో ఏం జరిగినా అది దేవుని చిత్తప్రకారమే జరుగుతుంది. (మనుష్యులను నమ్ముకొనుటకంటె యెహోవాను ఆశ్రయించుట మేలు. రాజులను నమ్ముకొనుట కంటే యెహోవాను ఆశ్రయించుట మేలు. కీర్తనలు 118:8)

దేవున్ని నమ్మని వారి జీవితంలో ఏం జరిగినా దానికి వారే బాధ్యత వహించాల్సి వుంటుంది. దేవున్ని నమ్మకపోవడం వలన కలిగే అనర్థాలకు దేవుడు ఏ బాధ్యత వహించడు. (నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయముతో యెహోవాయందు నమ్మక ముంచుము. నీ ప్రవర్తన అంతటి యందు ఆయన అధికారమునకు ఒప్పు కొనుము. అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును. నేను జ్ఞానిని గదా అని నీవనుకొనవద్దు. సామెతలు 3:5-7) మన తెలివితేటలు, జ్ఞానము, చదువు మన జీవితాన్ని సరైన మార్గంలో నడుపుటకు ఏ మాత్రం ఉపయోగపడవు. మహా జ్ఞానియైన సొలొమోనుకు సైతం తన జ్ఞానం ఏమి ఉపయోగపడలేదు. కాబట్టి మనం ఎంచుకొనే మార్గం దేవునికి ఇష్టమైనదో కాదో మనమే బైబిలు ద్వారా సరిచూసుకోవాలి. (ఒకని యెదుట సరియై నదిగా కనబడు మార్గము కలదు అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును. సామెత లు 14:12).

**చావు**

**ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను (ఆది.3:18)**

లోకమునైనను లోకములో ఉన్న వాటి నైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు. 1యోహాను 2:15. లోకమంటే ఏంటి? లోకంలో ఏమి దొరుకు తాయి? లోకము మనకు ఏమి ఇస్తుంది? ప్రతి మనిషిని నడిపించేది వారి ఆలోచనా విధానమే. దేవుని గురించి ఆలోచిస్తే దేవుడే నడిపిస్తాడు. లోకము గురించి ఆలోచిస్తే లోకమే మనిషిని నడిపిస్తుంది. లోకమంటే మనుష్యులే. అంటే మనిషి పుట్టిన దగ్గర్నుండి ఈ లోకంలో మనుష్యుల మధ్య జీవించాలి. ఇష్టమున్నా లేకపోయినా జీవించాలి, ఈ లోకంలో జీవించటం ఇష్టం లేకపోతే చనిపోవాలి. మనుష్యుల మధ్య నుండి పారిపోయి తలదాచుకో డానికి వేరే లోకం లేదు. కాబట్టి లోకంలో అంటే రకరకాల మనస్తత్వాలు కలిగిన మనుష్యులు వారు వ్యక్తపరిచే రకరకాల భావాల మధ్య జీవించేటప్పుడు చాలా మందికి ఈ లోకంతీరు నచ్చదు. అలా నచ్చనప్పుడు, ప్రత్యామ్నాయం ఏమి కనబడనప్పుడు ఈ లోకంలో జీవించ లేక ఆత్మహత్యలు చేసుకునేవారు చాలామంది ఉన్నారు. ఆత్మహత్యలు చేసుకునే ధైర్యంలేని వారు రోజూ చస్తూ బ్రతుకుతుంటారు. దీనంతటికీ కారణం దేవున్ని ఎరుగక పోవడమే. ఈ లోకంలో ధైర్యంగా జీవించాలి అంటే ఖచ్చితం గా ప్రతి మనిషి దేవున్ని వెతకాల్సిందే. ఎవరైతే దేవున్ని వెదకటం ప్రారంభిస్తారో వారికి దేవుడు తన్ను తాను తెలియ జేసుకుంటాడు. అప్పుడు దేవుడు వారికి సమాధానకరమైన జీవితం దయచేస్తాడు.

ప్రతి మనిషిని భయపెట్టేది భవిష్యత్తు. భవిష్యత్తు మొత్తం పూలపాన్పులా ఉండాలి అని అందరూ కోరుకుంటారు. బంగారు భవిష్యత్తు కోసం రకరకాల ప్రణాళికలు తయారుచేసు కుంటారు. జీవితకాలం మొత్తంలో మనిషి తన శాయశక్తులా కష్టపడేకాలం 40సం॥లు, అంటే సగటున 20సం॥ల ప్రాయం మొదలు కొని 60సం॥లు వచ్చే వరకు మనిషి కష్టపడు తూనే వుంటాడు. దేవుడు కొన్ని లక్షలమంది ఇశ్రాయేలీయులని అరణ్యములో నడిపించిన కాలము 40సం॥లు. ఈ 40సం॥లు వాళ్ళు ఏమి కష్టపడలేదు, పంటలు పండించలేదు, డబ్బు సంపాదించలేదు. వాళ్ళ బట్ట చినగలేదు, కాలు వాయలేదు, 40సం॥లు దేవుడు వారిని పోషించాడు. వాళ్ళు ఏది అడిగితే అది దేవుడు వారికిచ్చాడు. అయితే వారిలో అవిధేయులైన వారు, అవిశ్వా సులు అరణ్యములోనే చనిపోయారు. దేవుడు ఇశ్రాయేలీయు లకు చేసిన వాగ్దానాన్ని బట్టి వారిని ఐగుప్తు దేశము నుండి కనాను దేశమునకు వారికి ఇష్టమున్నా లేకపోయినా నడి పించాడు. ఇప్పుడైనా దేవుడు ప్రతి ఒక్కరిని నడిపించడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాడు. అయితే మనిషి ముందుగా దేవున్ని గుర్తించాలి. తన జీవితంపై దేవుని యొక్క అజమా యిషీని స్వచ్ఛందంగా అంగీకరించాలి. అప్పుడు మాత్రమే దేవుడు ఒక మనిషిని సరైన దారిలో నడిపిస్తాడు. **(ఇంకా వుంది)**

1

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | ■ | 1 | 2 | | 3 | 4 | ■ | ■ |
| 5 | ■ | | | ■ | 6 | | ■ | 7 |
| 8 | 9 | | ■ | ■ | ■ | 10 | 11 | |
| 12 | | ■ | 13 | | 14 | ■ | 15 | |
| | | ■ | | ■ | 17 | | | ■ |
| 18 | | ■ | 19 | | | ■ | 20 | 21 |
| 22 | | 23 | ■ | ■ | ■ | 24 | | |
| ■ | ■ | 25 | | ■ | 26 | | ■ | |
| ■ | ■ | 27 | | | | | ■ | |

# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 3

**అడ్డం:**

1. ఆసా కుమారుడు, యూదా రాజు (5)
6. --? నిజమా? (2)
8. మోషేను ఎదిరించిన లేవి మునిమనవడు (3) (తిరగబడింది)
10. దేవుని ఉన్నతమైన ---నకు కలుగు బహుమానము... పరుగెత్తుచున్నాను (3) (ఫిలిప్పీ)
12. యేసు నాల్గవ--న సముద్రముపై నడిచెను (2)
13. మధురం అను అర్థమిచ్చు పేరుగల స్త్రీ (3)
15. ఫరో కలలోని పీల ఆవుల సంఖ్య (2)
17. మా ---లు లెక్కించుట మాకు నేర్పుము (1,3,2) (కీర్తనలు)
18. --కు అందరూ స్నేహితులే (2) (సామెతలు)
19. ఆయన నరుల ---ను లక్ష్యపెట్టనివాడు (3) (ద్వితీ. 10)
20. దావీదు గొల్యాతు --ను తెగవేసెను (2)
22. యేసు దోనె ---మున నిద్రించుచుండెను (3) (తిరగబడింది)
24. ఏ ---న ఏది సంభవించునో అది నీకు తెలియదు (3)
25. యెహోషువ ఏ రాజును సాయంకాలము వరకు మ్రానుపై వ్రేలాడదీసెను (2)
26. పనిలో -- చేయువాడు నష్టము చేయువానికి సోదరుడు (2) (సామెతలు)
27. -----తో యెహోవా ఆరోహణమాయెను. (5) (బహువచనం) (కీర్తనలు 47)

**నిలువు:**

1. ఈ పట్టణానికి సుంకపు గుత్తదారుడు జక్కయ్య(3)
2. ఆంగ్ల 'పరిశుద్ధ గ్రంథము' తొలి అక్షరాలు (2)
3. మా ఇంటి పేరు పశువుల -- (2)
4. యేసును విడుదల చేయగోరిన అధికారి (3) (తిరగబడింది)
5. నయరా, అష్హూరుల కుమారుడు (4) (1 దిన)
7. భక్తిహీనులు చెడ్డవారికి దొరుకు --- సొమ్మును అపేక్షించుదురు (3) (సామెతలు)
9. సింహాసనమును ఆవరించిన ఇంద్రధనస్సు -----వలె ప్రకాశించుచుండెను (2,5,3,4,1) (ప్రకటన)
11. కపటములేని ఇశ్రాయేలీయుడు (5) (తిరగబడింది)
13. ఆమె (గుణవతియైన భార్య) నడికట్టు చేత ---ను బలపరచుకొని చేతులతో బలముగా పనిచేయును (సామెతలు)
14. నీ తల్లి ---యందు ఆమెను నిర్లక్ష్యము చేయకుము (3) (తిరగబడింది)
19. రాహాబు కిటికీకి తొగరు --- కట్టింది (3)
21. ఏలీయా పోషణకై దేవుడు వేటికి ఆజ్ఞాపించెను (ఏకవచనం) (3,4,2,1)
23. ఇశ్రాయేలు రాజైన ఒమ్రీ కుమారున్ని పిలవండి (3)
24. నిబ్బరము గలిగి ధైర్యముగా నుండుము --- పడకుము (3)
26. ఆంగ్ల యోహానును తెలుగు యాసలో పిలవండి (2)

**గమనిక:-** పరిశుద్ధగ్రంథ పరిశోధనా పట్టిక-3లోని గళ్ళను పూరించి, ఫోటో తీసి 9440217726 నంబరుకు వాట్సాప్ ద్వారా లేదా kerajendra@gmail.com కు ఈ-మెయిల్ ద్వారా పంపగలరు. వాట్సాప్, ఈ-మెయిల్ లేనివారు తెల్లపేపరు మీద లేదా పోస్ట్ కార్డు మీద అడ్డము, నిలువు సమాధానాలు వ్రాసి, ఎడిటర్, హన్నాకృప, పోస్ట్‌బాక్స్ నెంబర్-51, ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా, ఆం.ప్ర. అను అడ్రసుకు పంపగలరు.